# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



జిల్లాలో రెవెన్యూ, పౌర సరఫ రాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం కోటపల్లి, చెన్నూర్, హాజీపూర్ మండలాల్లో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి, పరిపాలనా కార్యక్రమాలను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా కోటపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసీ ల్దార్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

# ఆదిలాబాద్

## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

గురువారం 6 ఆగస్టు 2026 పేజీలు : 8


# రూ.17.09 లక్షల విలువైన 40.173 కిలోల గంజాయి ధ్వంసం




గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం...

విక్రయిస్తే కఠిన చర్యలు

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

---

# ఫీజుల పేరిట ప్రైవేట్ పాఠశాలల దోపిడీ



-విద్య వ్యాపారంగా మారిందా?

-ఇంచార్జి అధికారులతో న్యాయం జరిగేనా?



మంచిర్యాల పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోందనే విమర్శలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ట్యూషన్ ఫీజులకు పాటుగా అదనంగా పుస్తకాలు, యూనిఫార్మ్‌లు, షూలు, బెల్టులు,ఇతర విద్యా సామగ్రి పేరుతో తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చేశారంటూ పలువురు తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మంచిర్యాలతో పాటు పరిసర గ్రామాలు, మండలాల నుంచి వేలాది మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతుండటంతో,

# టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై కీలక తీర్మానాలు

**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యవర్గ సాధారణ సమావేశం బుధవారం టీఎన్జీవో భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సెప్టెంబర్ 30లోపు 100 శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు సంబంధించిన రూ.6 వేల కోట్ల నిధులను 100 రోజుల్లో విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రివర్గంతో పాటు టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్)లకు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై పలు కీలక తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమల్లోకి తీసుకురావాలని, ఎంప్లాయిస్ హెల్త్ కార్డును కుటుంబ సభ్యులందరికీ వర్తించేలా చర్యలు చేపట్టాలని, మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ 17 శాతం హెచ్‌ఆర్‌ఏ మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. ఈ తీర్మానాలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. అనంతరం ఇటీవల జైపూర్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించిన శ్రీపతి బాపురావును జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా కమిటీలో ఏర్పడిన ఉపాధ్యక్ష పదవి ఖాళీని కో–ఆప్షన్ విధానంలో నడిమెట్ల సత్యనారాయణతో భర్తీ చేసినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కేజియా రాణి అంజయ్య, తిరుపతి, రామ్‌కుమార్, నరేందర్, సంయుక్త కార్యదర్శులు సునీత, ప్రభు, పద్మలత, స్పోర్ట్స్ సెక్రటరీ కుమార్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్, మందమర్రి యూనిట్ అధ్యక్షుడు సుమన్, లక్సెట్టిపేట యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, బెల్లంపల్లి యూనిట్ కార్యదర్శి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



# రూ.17.09 లక్షల విలువైన 40.173 కిలోల గంజాయి ధ్వంసం

## గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం... విక్రయిస్తే కఠిన చర్యలు

### పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు రామగుండం పోలీస్ కమిషనరేట్ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 81 ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 40.173 కిలోల ఎండు గంజాయి, 26 గంజాయి మొక్కలను న్యాయస్థానం అనుమతితో ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం ధ్వంసం చేసినట్లు తెలిపారు .న్యాయాధికారుల సమక్షంలో కేసు ప్రాపర్టీ నుంచి ఎఫ్ఎస్ఎల్ పరీక్షల కోసం నమూనాలు సేకరించిన అనంతరం, కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి గ్రామంలోని వెంకటరమణ ఇన్సినిరేటర్స్‌లో పర్యావరణ నిబంధనలను పాటిస్తూ గంజాయిని దహనం చేసినట్లు తెలిపారు. ధ్వంసం చేసిన గంజాయి, గంజాయి మొక్కల మొత్తం విలువ సుమారు రూ.17.09 లక్షలు ఉంటుందని తెలిపారు . ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, నిల్వ, సరఫరా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, యువతను మత్తు బారిన పడేలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక పోలీసులు, స్పెషల్ డ్రగ్ కంట్రోల్ టీమ్స్, నార్కోటిక్ విభాగం సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయించడం, రవాణా చేయడం, నిల్వ ఉంచడం, సేవించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గంజాయి విక్రయించే లేదా సేవించే వారి సమాచారం అందించే వ్యక్తుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, జైపూర్ ఏసీపీ ఎ. వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ అనిల్, ఎస్ఐ వినీత తదితరులు పాల్గొన్నారు.

## భీమారం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

**సమయపాలన, వ్యాధి నివారణ చర్యలు, హెచ్‌పీవీ టీకాపై ప్రత్యేక ఆదేశాలు**



**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ బుధవారం భీమారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఉపకేంద్రాలు, గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, మందుల నిల్వలను ఔషధ రిజిస్టర్లలో క్రమం తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు. కీటక జనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మలేరియా పరీక్ష కిట్లు, డెంగ్యూ ఆర్‌డీటీ కిట్లు, అత్యవసర మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అపరిశుభ్రమైన తాగునీటి వల్ల వచ్చే డయేరియా, అతిసారం, జాండిస్, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు శుభ్రమైన తాగునీటినే వినియోగించాలని, రోడ్లపై విక్రయించే ఆహార పదార్థాలను తీసుకోవద్దని అవగాహన కల్పించాలని అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ ప్రతి వారం రెండు రోజుల పాటు ప్రత్యేక ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. 14 సంవత్సరాలు పూర్తయిన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించాలని, 30 సంవత్సరాలు పైబడిన వారికి అసంక్రమణ వ్యాధుల పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించడంతో పాటు వివరాలను రోజువారీగా పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. మాతా––శిశు సంరక్షణ, గర్భిణుల నమోదు, ప్రసూతి పరీక్షలు, ఆసుపత్రి ప్రసవాలు, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు శిశువులకు వంద శాతం టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు .ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్య అవగాహన కోసం ఐఈసీ డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని గ్రామాల్లో ప్రతిరోజూ పర్యటిస్తూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధి సర్వోత్తమ్ రెడ్డి నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సందర్శించిన డాక్టర్ నరేందర్ రాథోడ్ రక్తదాతలను అభినందించారు. ఇదే సందర్భంగా భీమారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విస్సీమల్ల విజయలక్ష్మి, పున్నమి చందర్, నల్లాల రాజేందర్, రాజ్‌కుమార్ నాయక్, కొత్త సత్తిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సీహెచ్ఓ నాందేవ్, వెంకటసాయి, వైద్య సిబ్బంది, ఆశా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# అటవీ అధికారులను అరెస్టు చేయకపోతే 10 నుండి నిరవధిక ఆందోళన

## అటవీ హక్కుల చట్టం 2006 ను పూర్తిగా అమలు చేయాలి

### ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మోకాశి

**జన్నారం,ఆగస్టు5(ప్రజాజ్యోతి)**జన్నారం మండలం నాయకపు గూడ అటవీ ప్రాంతంలో ఆదివారం రోజున చేపలు పట్టడానికి వెళ్లిన ఆదివాసి యువకులపై అటవీశాఖ అధికారులు దాడి చేసి గాయపరచడాన్ని ఆదివాసి సేన తీవ్రంగా ఖండిస్తుందని, అలాగే జన్నారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడుస్తున్న అట్టి అధికారులను అరెస్టు చేయకపోవడం దారుణమని ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మోకాశి అన్నారు.బుధవారం రోజున ఆదివాసి సేన సభ్యులతో కలిసి నాయకపుగూడ సంఘటన స్థలాన్ని సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఉందని ఆలోపు ఎవరైతే దాడి చేశారో వారిని మరియు అక్కడే ఉండి చూస్తున్న అటవీశాఖ అధికారులను అరెస్టు చేయకపోతే ఆగస్టు 10 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సస్పెన్షన్ కు గురైన ఇంధనపల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ ఆదివాసీలపై దాడి చేసినందుకు కాకుండా వేరే కారణంతో సస్పెండ్ చేశారని ఉత్తర్వులు జారీ చేశారు.అలా కాకుండా ఆదివాసీలపై దాడి చేసినందుకే సస్పెండ్ చేశామని ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.ఆదివాసీలపై టైగర్ జోన్ పేరుతో ప్రజలను ఇబ్బంది పెడుతున్న నిబంధనలను, నాయకపుగూడ గ్రామస్తులపై ఉన్న ఆంక్షలు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మరియు అటవీ అధికారులు కలిసి అటవీ హక్కుల చట్టం 2006ను పూర్తిగా అమలు చేసి వ్యక్తిగత, సామూహిక హక్కులు కల్పించాలని కోరారు. ఆగస్టు 9 లోపు సస్పెండ్ అయిన రేంజ్ అధికారి లక్ష్మీనా




రాయణ ను అక్కడే ఉన్న అటవీ శాఖ అధికారులను సిబ్బందిని అరెస్టు చేయాలని లేనియెడల ఆగస్టు 10 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అప్పటివరకు గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు అటవీ అధికారులకు ఎలాంటి సహాయం అందించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకపుగూడ గ్రామ. పటేల్ మూతి రాజేందర్, ఆదివాసి సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పేందోర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పేందోర్ శంకర్, రాయి సెంటర్ సార్మేడి పూసం సోనేరావు, జన్నారం మండల అధ్యక్షులు దుర్వ యశ్వంత్, జిల్లా సహాయ కార్యదర్శి మర్సకోల సంతోష్, దండేపల్లి మండల అధ్యక్షులు ఆత్రం జలపతి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఆత్రం మహేష్, జన్నారం యూత్ లీడర్ కనక మాణిక్ రావు, దండేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కుంరం భీం రావ్, దండేపల్లి మండల కార్యదర్శి పేంద్రం భీం రావ్, జన్నారం మండల ఉపాధ్యక్షులు కుంరం అరుణ్, కోశాధికారి తుంరం బోజ్జు, మండల సభ్యులు జుగ్నక్ గంగారాం తదితరులు పాల్గొన్నారు

# జంతర్ మంతర్‌లో సహారా బాధితుల ఆందోళనకు మద్దతుగా మంచిర్యాలలో నిరాహార దీక్ష

**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సహారా బాధితులు చేపట్టిన ఆందోళనలకు మద్దతుగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ గాంధీ పార్క్ ఆవరణలో బుధవారం ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు, సహారా బాధితుడు గజెల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది సహారా ఇండియాలో ఫిక్స్డ్ డిపాజిట్లు చేసి, గడువు ముగిసినా సుమారు రూ.40 వేల కోట్ల డిపాజిట్లు ఇప్పటికీ తిరిగి అందలేదని అన్నారు. అలాగే సహారా ఇండియాలో పనిచేసిన సుమారు 15 లక్షల మంది ఏజెంట్లకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న సహారా కేసు పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెంటనే స్పందించి సహారా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా సహారా బాధితుల పక్షాన నిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కోల్‌బెల్ట్




ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఎంపీలు పార్లమెంట్‌లో సహారా బాధితుల సమస్యను ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిరసనకారులు "సహారా బాధితుల ఐక్యత వర్ధిల్లాలి", "సహారాలో ఫిక్స్డ్ డిపాజిట్ చేసిన మా డబ్బులను వెంటనే చెల్లించాలి", "సహారా బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సహారా బాధితుడు పరిషే శ్రీనివాస్, ప్రముఖ న్యాయవాది కర్రె లచ్చన్నతో పాటు పలువురు సహారా బాధితులు పాల్గొన్నారు.


# సామాజిక చైతన్య నాటకాలతో శ్రీరాంపూర్‌లో సింగరేణి సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్

**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** సామాజిక ఐక్యత, అక్షరాస్యత, సామాజిక చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించే లక్ష్యంతో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో రెండు రోజుల పాటు ప్రత్యేక నాటక ప్రదర్శనలను నిర్వహించనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో నస్పూర్ సీఈఆర్ క్లబ్ ప్రాంగణంలోని గోదావరి ఫంక్షన్ హాల్‌లో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ఈ నాటకాలను ప్రదర్శించనున్నారు. ఆగస్టు 8న సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితం, ఆశయాల ఆధారంగా రూపొందించిన "సంఘం శరణం గచ్ఛామి" నాటకం ప్రదర్శించనున్నారు. ఆగస్టు 9న అదే సమయంలో సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతి రావు పూలే జీవితం, సామాజిక సంస్కరణలను ప్రతిబింబించే "సత్యశోధన" నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ నాటక ప్రదర్శనలను శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సింగరేణి విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సేవా సభ్యులు, కాలనీలు, బస్తీల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వీక్షించి విజయవంతం చేయాలని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సామాజిక చైతన్యం, సమానత్వ భావన, విద్య ప్రాముఖ్యత వంటి విలువలను ప్రజల్లో పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని జి.ఎం తెలిపారు.

# పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి




**మంచిర్యాలరూరల్ ఆగస్టు 05(ప్రజాజ్యోతి)** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ)వి.రాములు అధికారులను ఆదేశించారు. హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ వి.రాములు సాదాబైనామా,భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు. ఈసందర్భంగా పెండింగ్‌లో ఉన్నదరఖాస్తులు,ధ్రువపత్రాల జారీ ప్రక్రియను నిబంధనల మేరకు పరిశీలించి,ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే రెవెన్యూ సేవల అందింపులో పారదర్శకత, వేగం,బాధ్యతాయుత వ్యవహారం ఉండాలని సూచించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో తహసీల్దార్ పుష్పలత,నాయబ్ తహసీల్దార్ అతీష్,ఆర్ఐలు ప్రభు, మంగ తదితరులు పాల్గొన్నారు.

# వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిన ఎస్ఆర్పీ-1 గని స్వర్ణోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలి

## శ్రీరాంపూర్ ఏరియా జి.ఎం. మునిగంటి శ్రీనివాస్

## ఎస్ఆర్పీ-1 గోల్డెన్ జూబ్లీ వేడుకలకు సన్నాహాలు ప్రారంభం





**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి):** వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిన ఈ గని స్వర్ణోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సూచించారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఎస్ఆర్పీ-1 భూగర్భ గని సెప్టెంబర్ 2, 2026 నాటికి 50 ఏళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో గోల్డెన్ జూబ్లీ వేడుకల నిర్వహణకు సింగరేణి యాజమాన్యం సన్నాహాలు ప్రారంభించింది. ఈ సందర్భంగా బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ గని ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సెప్టెంబర్ 2, 1976న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ గని, ఐదు దశాబ్దాలుగా సింగరేణి అభివృద్ధిలో విశిష్ట పాత్ర పోషిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతలో ఎన్నో రికార్డులు నెలకొల్పిందని జీఎం పేర్కొన్నారు. వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిన ఈ గని స్వర్ణోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గని పరిసరాలను అందంగా తీర్చిదిద్దడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, గోల్డెన్ జూబ్లీ సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, విశ్రాంత అధికారులు అందరూ భాగస్వాములై ఈ వేడుకలను విజయవంతం చేయాలని జీఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ-2 జీఎం కృష్ణ ప్రసాద్, గ్రూప్ ఏజెంట్లు రవికుమార్, శ్రీధర్, ఏరియా ఇంజనీర్ సురేష్, మేనేజర్ ఆత్మారాం సహాని, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, గ్రూప్ ఇంజనీర్ మోహన్, డిప్యూటీ పీఎం క్రాంతి కుమార్, సంక్షేమ అధికారి అరుణ్ తేజతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# చెరుకు సరోత్తమ రెడ్డి జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం విజయవంతం







**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తమ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని భీమారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆవరణలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా ముగిసింది. సామాజిక సేవా దృక్పథంతో నిర్వహించిన ఈ శిబిరంలో యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్ వో) డాక్టర్ నరేందర్ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం అత్యున్నత మానవ సేవ అని, ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. శిబిరంలో మొత్తం 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. ఈ రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులతో పాటు తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరం నిర్వహణలో క్యాంపు ఆర్గనైజర్లుగా నల్లాల రాజలింగం, కోడేటి రవి, కట్ట నాగరాజు, దాసరి ప్రకాష్, జరుపుల రాజ్‌కుమార్, కొత్త సత్తిరెడ్డి, పుష్కమల్ల పున్నం చందు, పుష్కమల్ల శ్రీనివాస్, గంగనేని శేఖర్ తదితరులు కీలక పాత్ర పోషించారు. వీరు స్వయంగా రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాసు, బ్లడ్ బ్యాంక్ వైద్యుడు డాక్టర్ ప్రేమ్ సాయి, బ్లడ్ బ్యాంక్ సూపర్‌వైజర్ విజయ్, సిస్టర్ లావణ్య, హరీష్, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

# జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై కబ్జాలు తొలగించాలి

### ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కు వాకర్స్ అసోసియేషన్ వినతి



**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాముని చెరువు కట్టపై జరుగుతున్న అక్రమ కబ్జాలను వెంటనే తొలగించి చెరువు పరిసరాలను పరిరక్షించాలని రాముని చెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్రంలో ప్రముఖ వాకింగ్ ప్రదేశంగా ఉన్న రాముని చెరువు కట్ట ప్రాంతాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించి ఇళ్లు, నాలాలు నిర్మించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కబ్జాల కారణంగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన బహిరంగ ప్రదేశం క్రమంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వేలాది మంది ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే ఈ ప్రాంతంలో తగిన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వాకర్ల కోసం ప్రత్యేకంగా రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని, చెరువు కట్ట చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి భవిష్యత్తులో కబ్జాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా చుట్టుపక్కల కాలనీల నుంచి మురుగునీరు నేరుగా చెరువులోకి చేరుతుండటంతో నీటి కాలుష్యం పెరిగి చెరువు ఆహ్లాదకర వాతావరణం దెబ్బతింటోందని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి మురుగునీరు చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాముని చెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మెరుగు తిరుపతి, కమిటీ సభ్యులు షబ్బీర్ పాషా, రంగు రాజేశం, కైలాసం, రవూఫ్, బియ్యాల సత్తయ్య, అక్బర్ పాషా, సూర్యనారాయణ గౌడ్, ఇంతియాజ్ అలీ, సదన్న తదితరులు

# రాజ రమేష్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి: పైడిమల్ల నర్సింగ్



**రామకృష్ణాపూర్, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)** :రాజ రమేష్ చిల్లర రాజకీయాలు మానుకొని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కమిషనర్‌పై రాజ రమేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రతిపక్ష నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. ఎస్సీ సెల్ నాయకుడు దాముక రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అధి కారులను బెదిరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా, చట్టపరంగా ఎదుర్కొంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ చైర్‌పర్సన్ జంగం కళ, మాజీ ఎంపీటీసీ పుల్లూరి కళ్యాణ్, ప్రధాన కార్యదర్శి నక్క శ్రీనివాస్, కార్యదర్శి సాయి కృష్ణ, నేరెళ్ల చంద్రయ్య, రాజ్ కుమార్, రంజిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోపణలు నిరాధారం.. ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధం

– ఎమ్మెల్యే సవాల్


తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను ఖండించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** తనపై ఇటీవల వెలువడుతున్న అవినీతి ఆరోపణలు, కొన్ని పత్రికల్లో ప్రచురితమైన కథనాలను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తీవ్రంగా ఖండించారు. తనపై జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, రాజకీయ కుట్రలో భాగంగానే ఈ ఆరోపణలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని వదిలిపెట్టబోనని, సంబంధిత పత్రికలు, వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. సొంత పత్రికల్లో కాకుండా ఇతర పత్రికల్లో తనపై అసత్య కథనాలు ప్రచురింపజేస్తున్నారని విమర్శించారు. త్వరలో ఈ కుట్రల వెనుక ఉన్న వాస్తవాలు ప్రజల ముందుకు వస్తాయని అన్నారు. తనపై రూ.450 కోట్ల అవినీతి జరిగిందంటూ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 2009–10లో బ్యాంకు సాయినాథ్ ప్రైవేట్ లిమిటెడ్, భాగ్యనగర్ హోటల్స్ పేర్లపై రూ.450 కోట్ల రుణాన్ని మంజూరు చేసిందని, అది చట్టబద్ధమైన బ్యాంకు ప్రక్రియలో భాగమేనని వివరించారు. తాను ఎలాంటి పత్రాలు సృష్టించలేదని, బ్యాంకు మంజూరు చేసిన శాంక్షన్ ఆర్డర్లు అధికారిక పత్రాలేనని చెప్పారు. 2014 నుంచి 2025 వరకు కంపెనీ వినియోగించిన మొత్తం నిధులు రూ.109 కోట్ల 11 లక్షలేనని, అదే మొత్తాన్ని బ్యాంకులు ఎన్‌పీఏగా ప్రకటించాయని తెలిపారు. 2014 నుంచి 2025 వరకు రూ.44 కోట్ల 81 లక్షలు చెల్లించామని, ఆంధ్ర బ్యాంకు ఎన్‌పీఏ అయిన తర్వాత కూడా రూ.18 కోట్ల 72 లక్షలు చెల్లించినట్లు వెల్లడించారు. 2024 అక్టోబర్ 31 నుంచి కూడా చెల్లింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. రూ.450 కోట్ల మోసం జరిగి ఉంటే బ్యాంకు రూ.109 కోట్లకే వేలం ఎలా వేస్తుందని ప్రశ్నించారు. అమెరికా ట్రేడింగ్ మార్కెట్ పతనం తర్వాత తనకు రూ.160 కోట్ల నష్టం వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 పాఠశాలలు నిర్మించానని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ ఎప్పుడూ అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని చెప్పారు. ఇసుక, భూముల అక్రమ వ్యవహారాల్లో పాల్గొనాలనుకుంటే అప్పుడే చేసేవాడినని, అలాంటి పనులు ఎప్పుడూ చేయలేదని స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలపై నిజానిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తే పూర్తి ఆధారాలతో కమిటీ ముందు హాజరవుతానని ఎమ్మెల్యే ప్రకటించారు. తాను ఆధారాలు లేకుండా ఎప్పుడూ ఫిర్యాదులు చేయనని, పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్ పార్టీ కోసం పోరాటం చేశానని గుర్తు చేశారు. మంత్రి పదవి చర్చకు వచ్చిన ప్రతిసారీ తనపై ఇలాంటి ఆరోపణలు వెలువడుతున్నాయని వ్యాఖ్యానించిన ప్రేమ్ సాగర్ రావు, ఇవన్నీ రాజకీయ కుట్రలో భాగమేనని ఆరోపించారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారు ఎక్కడైనా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తాను అన్ని ఆధారాలతో ప్రజల ముందు నిజాలను వెల్లడించడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఇటీవల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుపై ప్రతి పక్ష రాజకీయ పార్టీల నాయకులు చేసిన ఆరోపణలకు సమాధానంగా ఆయన ఈ వివరణ ఇచ్చారని పరిశీలకులు భావిస్తున్నారు.

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి





## జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు

**మంచిర్యాల, ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):** జిల్లాలో రెవెన్యూ, పౌర సరఫరాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం కోటపల్లి, చెన్నూర్, హాజీపూర్ మండలాల్లో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి, పరిపాలనా కార్యక్రమాలను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా కోటపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. కోటపల్లి శివారులోని సర్వే నంబర్ 389లో 1.12 ఎకరాల భూమిని కార్యాలయ నిర్మాణానికి గుర్తించినట్లు తెలిపారు. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన పరిపాలనా చర్యలను వేగవంతం చేసి, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెన్నూర్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంను సందర్శించి ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యం తరలింపు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 15వ తేదీలోపు బియ్యం తరలింపును పూర్తి చేయాలని గోదాం నిర్వాహకులకు సూచించారు. వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం కోసం సరఫరా చేసే బియ్యాన్ని నాణ్యతతో, సమయానికి పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డుదారుల ఈ–కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. స్టేజ్–2 కాంట్రాక్టర్ తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి బియ్యం రవాణా, సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తదుపరి హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సులకు సంబంధించిన దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ధ్రువపత్రాల జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని పెండింగ్ పనులను ప్రాధాన్యతతో పూర్తి చేసి, సేవలను సమర్థవంతంగా అందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతరకు పోలీసుల విస్తృత భద్రతా ఏర్పాట్లు



**రామకృష్ణాపూర్, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి):** ఈ నెల 9న నిర్వహించనున్న గాంధారి బోనాల జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు అధికారులు భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలించారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతర ప్రాంతాన్ని మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్, మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, కాసిపేట ఎస్ఐ అంజనేయులు, స్థానిక ఎస్ఐ శ్రీధర్ తదితరులు సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతీయ రహదారి అథారిటీ ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటు చేయగా, భక్తులు ట్రాఫిక్ నియమాలను పాటించి పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# అనమలిస్ జాబితా సవరణకు సహకరించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ హరిత సూచన



**ఆసిఫాబాద్, ఆగస్టు 5 ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా అనమలిస్ జాబితాలోని వివరాలను సరిచేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల్లో నమోదైన వివరాల్లో తప్పులు ఉంటే సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. ఇంటిపేరు, పేరు, వయసు తదితర వివరాలను సవరించుకోవచ్చని తెలిపారు. సంబంధిత వివరాలు బూత్ స్థాయి అధికారి యాప్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అనమలిస్ జాబితాలో ఉన్న సంఖ్యను తగ్గించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని, బూత్ స్థాయి ఏజెంట్లను ప్రక్రియలో భాగస్వామ్యం చేసేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీలోగా సవరణ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి: కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. బుధవారం ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్‌తో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతతో పాటు ప్రజలందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాల నివారణపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వైద్య కళాశాలలోని సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకట్, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు, సిబ్బంది, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల పేరిట ప్రైవేట్ పాఠశాలల దోపిడీ

**-విద్య వ్యాపారంగా మారిందా?**

**-ఇంచార్జి అధికారులతో న్యాయం జరిగేనా?**




**మంచిర్యాలరూరల్ ఆగష్టు05(ప్రజాజ్యోతి)** మంచిర్యాల పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోందనే విమర్శలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ట్యూషన్ ఫీజులకు పాటుగా అదనంగా పుస్తకాలు, యూనిఫార్మ్‌లు, షూలు, బెల్టులు,ఇతర విద్యా సామగ్రి పేరుతో తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చేశారంటూ పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మంచిర్యాలతో పాటు పరిసర గ్రామాలు,మండలాల నుంచి వేలాది మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతుండటంతో,కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు ఈపరిస్థితిని అవకాశంగా మలుచుకుని ఇష్టారాజ్యంగా ఫీజులు నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫీజుల వివరాల్లో పారదర్శకత లేకపోవడం,అదనపు వసూళ్లపై స్పష్టత లేకపోవడం తల్లిదండ్రుల్లో అసంతృప్తిని పెంచుతోంది. ఇటీవల ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య ప్రైవేట్ పాఠశాలలు తమ ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేసినట్లు మండల విద్యాధికారి మాలవిదేవి వెల్లడించారు. అయితే ఆ ఆదేశాలు అన్ని పాఠశాలల్లో అమలవుతున్నాయా వాటిపై అధికారులు ఎంత మేర పర్యవేక్షణ చేపట్టారు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పట్టణంలో సుమారు 55 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా,కేవలం 8 నుంచి 9 పాఠశాలల్లో మాత్రమే మండల విద్యాధికారి తనిఖీలు నిర్వహించారనే సమాచారం చర్చనీయాంశంగా మారింది. మిగిలిన పాఠశాలల్లో తనిఖీలు ఎందుకు జరగలేదు?అన్ని విద్యాసంస్థలకు ఒకే నిబంధనలు వర్తించవా? అనే సందేహాలను తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల అనంతరం ట్రినిటీ పాఠశాలకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎంఈవో పేర్కొన్నారు. అయితే ఒక్కటి లేదా రెండు పాఠశాలలకే పరిమితమయ్యే చర్యలు కాకుండా, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రతి పాఠశాలపై సమానంగా, పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా విద్యాశాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో సమగ్ర తనిఖీలు చేపట్టాలని,ఫీజుల నియంత్రణ, నిబంధనల అమలు,తల్లిదండ్రుల ఫిర్యాదుల పై పరిష్కారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, విద్యావేత్తలు అధికారులను కోరుతున్నారు.

# గాంధీభవన్ ముందు కొమురం భీం కాంగ్రెస్ నేతల నిరసన

**"నాన్-లోకల్ డీసీసీ హఠావో.. కాంగ్రెస్ బచావో"**

**అంటూ నినాదాలు**

**డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్కను మార్చాలని**

**డిమాండ్.. టీపీసీసీ అధ్యక్షుడికి వినతిపత్రం**






**ఆసిఫాబాద్ ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత అసంతృప్తి మరోసారి బహిర్గతమైంది. జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. "నాన్-లోకల్ డీసీసీ హఠావో.. కాంగ్రెస్ బచావో" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కను మార్చాలని, స్థానిక నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ వ్యవహారాల్లో స్థానిక నాయకత్వానికి తగిన ప్రాధాన్యత లేకపోవడంతో కార్యకర్తల్లో అసంతృప్తి పెరుగుతోందని వారు ఆరోపించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలంటే స్థానిక పరిస్థితులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నాయకత్వ నిర్ణయాలు ఉండాలని వారు పేర్కొన్నారు.

**స్థానిక నాయకత్వానికే ప్రాధాన్యత ఇవ్వాలి**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలను పార్టీ నిర్ణయాల్లో భాగస్వాములను చేయాలని నాయకులు కోరారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల అభిప్రాయాలను విస్మరించరాదని అన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి స్థానికంగా ప్రజల్లో మంచి సంబంధాలు ఉన్న నాయకులకు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల సేవలను గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించాలని కోరారు.

**టీపీసీసీ అధ్యక్షుడికి వినతిపత్రం**

గాంధీభవన్ ఎదుట నిరసన అనంతరం కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి తమ అభ్యంతరాలను వివరించారు. జిల్లా కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లి, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిని మార్చడంతో పాటు స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత కల్పించాలని, కార్యకర్తల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరినట్లు తెలిపారు. పార్టీని ఏకతాటిపైకి తీసుకువచ్చి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా నాయకత్వ నిర్ణయాలు ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**అధిష్ఠానం దృష్టికి జిల్లా పరిస్థితులు**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తల నెట్‌వర్క్ ఉందని, అయితే నాయకత్వ పరంగా నెలకొన్న కొన్ని పరిస్థితుల కారణంగా కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని నాయకులు పేర్కొన్నారు. ఈ అంశాలను పార్టీ రాష్ట్ర నాయకత్వం సీరియస్‌గా పరిగణించి పరిష్కరించాలని కోరారు. స్థానిక సమస్యలు, కార్యకర్తల అభిప్రాయాలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరారు. పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులు, యువ నాయకులు, మండల స్థాయి ప్రతినిధులకు సముచిత ప్రాధాన్యత లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు**

ఈ నిరసన కార్యక్రమంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, వివిధ మండలాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గాంధీభవన్ ఎదుట నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కాంగ్రెస్‌లో నెలకొన్న అసంతృప్తికి త్వరితగతిన పరిష్కారం చూపాలని, స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని నాయకులు కోరారు. ఈ పరిణామం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తల్లిపాలే బిడ్డకు తొలి రక్షణ!

**జనకపూర్‌లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన**

**ఆరు నెలలు తల్లిపాలే.. ఆరోగ్యానికి పునాది!**

**1వ వార్డులో కౌన్సిలర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**ఆసిఫాబాద్ ఆగస్టు 5 ప్రజా జ్యోతి** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆసిఫాబాద్ మునిసిపల్ పరిధిలో నీ జనకపూర్ 1వ వార్డులో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1వ వార్డు కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్, అంగన్వాడీ పిల్లలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యత, శిశువుల ఆరోగ్య పరిరక్షణ, తల్లి--బిడ్డల ఆరోగ్యానికి తల్లిపాలు అందించే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం ప్రారంభించి, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలను అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతాయని వివరించారు.కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. "ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే



తొలి అడుగు" అని అన్నారు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకుని, శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. తల్లిపాలతో శిశువుల్లో అనారోగ్య సమస్యలు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోషకాహారం, శిశు సంరక్షణకు సంబంధించిన చార్టులు, రంగోలి ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా తల్లులు, ప్రజలకు పోషకాహారం, శిశు సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంగన్వాడీ సిబ్బంది కృషి చేశారు.

## సింగరేణి ఆదాయం పెంచేందుకు వేలం లేకుండా బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి**

**కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు**





**మంచిర్యాల, 5,ఆగస్టు (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ ఆదాయం పెంచడం, రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం ప్రక్రియ లేకుండానే బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయిస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు మణుగూరు పీకేఓసీ-2 డీప్ సైడ్ కోల్ బ్లాక్ కేటాయించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం శ్రీరాంపూర్ సింగరేణి ఆర్కే-7 గనిలో కార్మికులను ఆయన కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఇటీవల తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌తో పాటు మణుగూరు పీకేఓసీ-2 డీప్ సైడ్ కోల్ బ్లాక్‌ను కూడా ఎలాంటి బిడ్డింగ్ లేకుండా కేటాయించిందన్నారు. ఈ బ్లాక్ ద్వారా వచ్చే 30 సంవత్సరాల పాటు సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. దీని ద్వారా సింగరేణి సంస్థకు సుమారు రూ.42,360 కోట్ల ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్ల ఆదాయం లభించడంతో పాటు సుమారు 2 వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవతో గతంలో ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచెర్ల-2 కోల్ బ్లాక్, ప్రస్తుతం పీకేఓసీ-2 కోల్ బ్లాక్‌లను సింగరేణికి కేటాయించడం జరిగిందన్నారు. ఈ మూడు కోల్ బ్లాక్‌ల ద్వారా మొత్తం 860 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 6,500 మందికి ఉపాధి, సింగరేణి సంస్థకు రూ.1,95,510 కోట్ల ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.48 వేల కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తోందని, భవిష్యత్తులో కూడా ఇదే సహకారం కొనసాగుతుందని రఘునాథ్ వెరబెల్లి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, కమలాకర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, పట్టి వెంకట కృష్ణ, ఆనంద్ కృష్ణ, ఈర్ల సదానందం, పొన్నవేణి సదయ్య, కాదాసు భీమయ్య, గొల్ల మహేందర్, కొండ వెంకటేష్, కట్కూరి సతీష్, అట్నాపురం సమ్మయ్య, బొజ్జ నర్సయ్య, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# "సెప్టెంబర్ 9,2026 "న సింగరేణి విశ్రాంత ఉద్యోగుల " ఆత్మీయ సమ్మేళనం"

**విజయవంతానికి అడ్ హక్ కమిటీ సమన్వయంతో ముందుకు సాగాలి**

**ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఒక్కరిని గౌరవిస్తూ ఘనంగా నిర్వహించాలి**

**మంచిర్యాల జిల్లా కేంద్రం లో "ఆత్మీయ సమ్మేళనం" సన్నాహక సమావేశం**





**మంచిర్యాల ఆగస్టు 5 (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 2026 సెప్టెంబర్ 9న నిర్వహించనున్న "సింగరేణి విశ్రాంత ఉద్యోగుల మహా ఆత్మీయ సమ్మేళనం"ను ఘనంగా విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మహా సమ్మేళనం ఏర్పాట్లపై అడ్ హక్ కమిటీ సభ్యులతో బుధవారం జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మహా సమ్మేళనం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, బాధ్యతల పంపిణీ, అతిథుల ఆహ్వానం, సభ్యుల భాగస్వామ్యం, వేదిక ఎంపిక, సత్కార కార్యక్రమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మహా సమ్మేళనాన్ని 2026 సెప్టెంబర్ 9వ తేదీన ఉదయం 9 గంటలకు సకాలంలో ప్రారంభించి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమావేశ కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కార్యక్రమాన్ని నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని తీర్మానించారు. అదేవిధంగా మహా సమ్మేళనాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని లేదా రామకృష్ణాపూర్‌లోని అనువైన ఫంక్షన్ హాల్‌లో నిర్వహించాలనే అంశంపై చర్చించి, అన్ని సౌకర్యాలు, అందుబాటు, పార్కింగ్, అతిథుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని త్వరలోనే తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఇతర ప్రాంతాల నుంచి హాజరయ్యే ముఖ్య అతిథులు, విశ్రాంత ఉద్యోగులు, ఆహ్వానితులకు అవసరమైన వసతి, రవాణా, ఆతిథ్య ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టాలని, అందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. సమ్మేళనానికి సహకరిస్తున్న ప్రతి సభ్యుడి సేవలను గుర్తిస్తూ బ్యాడ్జి, జ్ఞాపిక (మెమెంటో), శాలువాతో ఘనంగా సత్కరించాలని నిర్ణయించారు. విశ్రాంత ఉద్యోగుల సేవలకు గుర్తింపుగా ఈ సత్కార కార్యక్రమాన్ని ప్రత్యేక ఆకర్షణగా నిర్వహించాలని నాయకులు కోరారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహా సమ్మేళనంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రతి ఒక్కరిని సమాన గౌరవంతో ఆదరిస్తూ, ఆత్మీయ వాతావరణంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమ్మేళనం విజయవంతం కావడంలో అడ్ హక్ కమిటీ సభ్యుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి అంశాన్ని సమన్వయంతో నిర్వహిస్తూ మిగతా సభ్యులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, మార్గదర్శకాలు అందించాలని కోరారు. అడ్ హక్ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మహా సమ్మేళనం విజయవంతం కోసం పలు నిర్మాణాత్మక సూచనలు చేశారు. సమష్టి కృషి, పరస్పర సహకారం, క్రమశిక్షణతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కలిసికట్టుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పూదరి నరసయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అలవోయిన గంగన్న, హడ్ హక్ కమిటీ సభ్యులు మామిడిపల్లి అంజయ్య పేరాల రాజమల్లు, మియాపురం వీరాచారి, బోనగిరి కృష్ణ, చిందం మల్లేష్, గోల్కొండ లక్ష్మీనారాయణ, పోతరాజుల చంద్రయ్య, బి. దశరథం, పి. వెంకట రత్నం, ఐ. రామయ్య, గోపతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# చదువు మధ్యలో ఆపేశారా.. మళ్లీ కొనసాగించండి!

## తెలంగాణ ఓపెన్ స్కూల్ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్, ఆగస్టు 5 ప్రజా జ్యోతి** చదువును మధ్యలోనే నిలిపివేసిన వారు, ఉద్యోగులు, గృహిణులు, ఇతర కారణాలతో విద్యను కొనసాగించలేకపోయిన వారు తెలంగాణ ఓపెన్ స్కూల్ అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిత పిలుపునిచ్చారు.తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సర ప్రవేశాలకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నినాదంతో చదువుకు దూరమైన ప్రతి ఒక్కరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దడమే ఓపెన్ స్కూల్ లక్ష్యమన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేయాలనుకునే అర్హులు సమీపంలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను సంప్రదించి నిర్ణీత గడువులోగా ప్రవేశాలు పొందాలని సూచించారు. విద్య వ్యక్తిగత అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు, సమాజ పురోగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని మండలాల్లో ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మట్, డీఈఓ సచ్చిదానంద చారి, పరీక్షల సహాయ కమిషనర్ జనార్దన్, ప్లానింగ్ కోఆర్డినేటర్ అబ్దుల్ లతీఫ్, జిల్లా సైన్స్ అధికారి కటకము మధూకర్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష!

## బెస్తవాడ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**ఆసిఫాబాద్ , ఆగస్టు 5 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ వాంకిడి మండలం ఖమన గ్రామ పంచాయతీ పరిధిలోని బెస్తవాడ అంగన్వాడీ సెంటర్-3లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ పొచ్చుబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా శిశువులకు తల్లిపాలు అందించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, తల్లి-బిడ్డల ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాల పాత్ర, శిశువుల ఎదుగుదలలో తల్లిపాలు అందించే పోషక విలువల గురించి వివరించారు. పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు (కొలస్ట్రం) అందించడం ఎంతో ముఖ్యమని, తల్లిపాలు శిశువులకు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. "ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలే తొలి అడుగు" అని పేర్కొంటూ, ప్రతి తల్లి తప్పనిసరిగా శిశువుకు తల్లిపాలు అందించాలని సూచించారు. తల్లిపాలపై ఉన్న అపోహ లను తొలగించి, తల్లులకు సరైన అవగా హన కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మీబాయి, చంద్రకళ, విజయలక్ష్మి, నిర్మల, అంగన్వాడీ ఆయాలు, ఏఎన్ఎం, చిన్నారులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంత ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 5 ,( ప్రజాజ్యోతి ).**జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మెరుగైన రవాణా, మౌలిక వసతులు, ప్రభుత్వ సంక్షేమ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు.బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి (డి.ఎల్.సి) ప్రత్యేక సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అటవీ, గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన రహదారులు, రవాణా సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాప్రయోజన ప్రాజెక్టుల అమలులో అటవీ శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నాణ్యమైన రహదారులు, మెరుగైన మౌలిక వసతుల ద్వారా అటవీ గ్రామాలు జిల్లా, మండల కేంద్రాలతో అనుసంధానమై ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు.మైసంపేట పునరావాస గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామంలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు తదితర మౌలిక సదుపాయాల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పునరావాస గ్రామాన్ని అన్ని విధాలుగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీఓ దేవిదాస్, డీటీడీఓ నిహారిక, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, అటవీ, రెవెన్యూ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా చైర్‌పర్సన్




**రామకృష్ణాపూర్, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి):**ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల సమస్య పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి, నాయకుడు రాజారమేష్ తెలిపారు. వేతనాల తగ్గుదలపై ఆందోళన వ్యక్తం చేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చైర్‌పర్సన్‌ను కలిసి గతంలో ఉన్న వేతనాలనే కొనసాగించాలని కోరారు.దీనిపై స్పందించిన చైర్‌పర్సన్, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి పాత వేతనాలు కొనసాగించేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రతి నెల ఒకటో తేదీన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూమా గౌడ్, మద్దెల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నేతకాని' పేరుకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

## కేంద్ర మంత్రిని కలిసి డిమాండ్ వినిపించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**మంచిర్యాల, 5,ఆగస్టు (ప్రజా జ్యోతి):**పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ నేతకాని సామాజిక వర్గం ఆత్మగౌరవానికి సంబంధించిన కీలక సమస్యను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ను న్యూఢిల్లీలో కలిసి, ప్రభుత్వ రికార్డుల్లో తప్పుగా నమోదైన 'నెత్కాని' అనే పేరును సరిచేసి అసలు పేరు లె'నేతకాని'లిగా నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ పేరు మార్పు ప్రక్రియకు సంబంధించిన పూర్తి పరిపాలనా విధానాన్ని ఎంపీకి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రతిపాదన రావడంతో పాటు, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) మరియు జాతీయ ఎస్సీ కమిషన్ నుంచి అవసరమైన సిఫార్సులు అందిన అనంతరం పేరు మార్పు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంలోని సంబంధిత అధికారులతో, ముఖ్యంగా లక్ష్మణ్ కుమార్‌తో చర్చించినట్లు ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తక్షణమే అధికారిక లేఖను కేంద్ర మంత్రిత్వ శాఖకు పంపేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు .ఎన్నికల సమయంలో నేతకాని వర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ అంశాన్ని వ్యక్తిగతంగా తీసుకుని ముందుకు తీసుకెళ్తున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. "నేతకాని సమాజం గౌరవం, ఆత్మగౌరవం, గుర్తింపుకు సంబంధించిన ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రతి దశను స్వయంగా ఫాలోఅప్ చేస్తాను. ప్రభుత్వ రికార్డుల్లో సరైన పేరు 'నేతకాని'గా నమోదయ్యే వరకు మా కృషి కొనసాగుతుంది" అని అన్నారు. నేతకాని సమాజానికి చారిత్రక న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చేస్తూ అవసరమైన అన్ని అనుమతులు, సిఫార్సులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ హామీ ఇచ్చారు.

## అర్హులైన పథకాలన్నీ లబ్ధిదారులకు చేరేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలి

జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 5 ,( ప్రజాజ్యోతి ) నిర్మల్ జిల్లా బైంసా మండల కేంద్రంలోని ఐకెపి హాలులో ఎల్డిఎం రామ్ గోపాల్ ఆధ్వర్యంలో మండలస్థాయి బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్డీఎం మాట్లాడుతూ మండల పరిధిలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రుణాలు, వ్యవసాయం మరియు గ్రామీణాభివృద్ధి కింద బ్యాంకుల ద్వారా అందించే ఆర్థిక సహాయంపై సుదీర్ఘంగా చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో బ్యాంక్ రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా చేయూత నందించాలని అధికారులకు, బ్యాంకర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం జిల్లా కలెక్టర్



**సోన్, ఆగస్టు 05(ప్రజా జ్యోతి):**మండల కేంద్రంలోని న్యూ వెల్మల్ గ్రామంలో రీ సర్వే నిర్వహణ ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.బుధవారం సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామానికి చెందిన వ్యవసాయ భూముల్లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టింది అన్నారు. సర్వే అధికారులకు రైతులు సహకరించాలని తెలిపారు. రీ సర్వే నిర్వహించే సమయంలో తప్పనిసరిగా రైతులు అందుబాటులో ఉండాలని చెప్పారు. రీ సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సంబంధిత అధికారుల బృందం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియకు సహకరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి సంబంధించి భూముల వివరాలు, చేపట్టిన సర్వే వివరాలు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రైతు భూమి రీ సర్వే ప్రక్రియను ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. ఎకరం భూమి సర్వే చేయడానికి సుమారు ఎంత సమయం అవసరం అవుతుంది అనే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియను మొత్తం పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ నరసింహమూర్తి, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ రాచకొండ సాగర్, కొండ రవి, జీలకర్ర వేణు, ధోని భీమేష్, భోజన్న,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు

### ట్రాఫిక్ నిబంధనల అమలులో రాజీ లేదు

### పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల, 5,ఆగస్టు (ప్రజాజ్యోతి):**రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల సురక్షిత ప్రయాణమే ప్రధాన లక్ష్యంగా రోడ్డు భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన రవాణా శాఖ (ఆర్టీఏ), లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఇసుక, బొగ్గు, యాష్ తదితర లోడ్లను తరలించే వాహనాలు తప్పనిసరిగా టార్పాలిన్ కవర్లతో కప్పి మాత్రమే రవాణా చేయాలని స్పష్టం చేశారు. లోడ్లు బహిరంగంగా తరలించడం వల్ల రోడ్డుపై ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలగడంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వాహన యజమానులు, డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులు, పాఠశాల, కళాశాల విద్యార్థులను తరలించే ఆటోలు, ఇతర రవాణా వాహనాల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ఇటువంటి వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకుండా నాలుగు చక్రాల వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్ లేని వాహనాల వినియోగం, మైనర్ల చేత వాహనాలు నడిపించడం, నిర్లక్ష్యంగా వేగంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఎలాంటి రాజీ లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు



జారీ చేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం అందించే రహ్-వీర్ (రాహ్-వీర్) పథకం గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను గోల్డెన్ అవర్గా పరిగణిస్తారని, ఆ సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రమాదాలను చూసిన వారు భయపడకుండా బాధితులను సమీప ఆసుపత్రికి తరలించి, పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో పోలీసు శాఖ, రవాణా శాఖతో పాటు సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజల్లో బాధ్యతాయుతమైన అవగాహన పెంపొందించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని, ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని అన్నారు. ఈ సమావేశంలో రామగుండం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా రవాణా అధికారి గోపీకృష్ణ, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హసన్, మంచిర్యాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, రామగుండం, పెద్దపల్లి, మంచిర్యాల అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ను మర్యాదపూర్వకంగా కలిసిన టిజిఎన్ పిడిసిఎల్ నూతన ఎస్ఈ ఎ. రమేష్



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఆగస్టు 5 ,( ప్రజాజ్యోతి ).**జిల్లాకు బదిలీపై వచ్చిన విద్యుత్ శాఖ (టిజిఎన్ పిడిసిఎల్) నూతన ఎస్ఈ ఎ. రమేష్ బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ను కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతగా పని చేసి శాఖకు జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఎస్ఈ ఎ. రమేష్ కు ఈ సందర్భంగా జిల్లా అధికారులు స్వాగతం పలికారు. శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా ఇక్కడ ఎస్ ఈ గా పనిచేసిన సుభాష్ అదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

## రైతుల భూములపై స్పష్టమైన యాజమాన్య హక్కు కల్పిస్తాం

సోనాల మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్.



**సోనాల, ఆగస్టు 05 ( ప్రజాజ్యోతి ):** సోనాల మండలంలోని పార్ది ( కే ) గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లాపూర్ గ్రామంలో ప్రభుత్వం నిర్వహించే భూభారతి భూముల సర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని గొల్లపూర్ గ్రామాన్ని తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ సర్పంచ్ సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు. చౌహాన్ వినోద్ సింగ్ మాట్లాడుతూ రైతులకు స్పష్టమైన సరిహద్దులు, ఖచ్చితమైన సర్వే చేసి డిజిటల్ రికార్డులు రూపొందించడం, భూవివాదాలు తగ్గించి పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమం లో భూ సర్వేయర్ విలాస్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సునీత, జి పి ఓ లు అనుజ్ఞ , రవీందర్, ఉప సర్పంచ్ అశోక్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ నిర్మల్ ఇన్‌చార్జ్ కే. రామకృష్ణారెడ్డి



**దిలావర్ పూర్ , ఆగష్టు 5,( ప్రజాజ్యోతి ).**దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం, గుండంపల్లి గ్రామాల్లో ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నిర్మల్ ఇన్‌చార్జ్ కే. రామకృష్ణారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యం చెప్పారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండలానికి చెందిన బిఆర్ యస్ పార్టీ కన్వినర్ ఎలాల చిన్న రెడ్డి నిర్మల్ మండలం కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి జిల్లా గ్రీన్ ఇండియా ప్రెసిడెంట్ రాథోడ్ అశోక్, బిఆర్ యస్ పార్టీ.సీనియర్ నాయకులు జాన్ సత్య.సంగం గంగ రెడ్డి.మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భాజపా యువ నాయకుడికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ





**నిర్మల్ జిల్లా ప్రతినిధి , ఆగస్టు 5 ,( ప్రజాజ్యోతి)**నిర్మల్ జిల్లా లోని భైంసా మండలం వాలేగం గ్రామానికి చెందిన బీజెవైఎం,భైంసా మండల ఉపాధ్యక్షులు సిందే గంగాప్రసాద్ ముధోల్ నియోజక వర్గం భాజపాపార్టీలో, చురుకైనా యువ నాయకుడిగా పేరు ప్రక్యతలు సాధించుకున్నాడు పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తూ ఉండే యువ నాయకున్ని పలువురు ముఖ్యనేతలు కేంద్ర మంత్రి బండి సంజయ్,ముధోల్ ఎమ్మెల్యే రామ్ రావ్ పటేల్, మల్కాజ్గిరి ఎంపీ ఈటాల రాజేందర్, అదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్, చరవాణిలో ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపినట్టు ఆయన పేర్కొన్నారు నిర్మల్ నియోజకవర్గం శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన నివాసంలో యువ నాయకుడు గంగప్రసాద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించరు ఈ సందర్బంగా, ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎవరికైనా కష్టం వస్తే రక్త ధాతగా ముందుంటూ ఎందరో పేద వారికి సహాయం చేసిన గంగా ప్రసాద్ ఆభగవంతుని అనుగ్రహం తో మరిన్ని సేవా కార్యక్రమా లు ,రక్తధాన కార్యక్రమలు చెపట్టలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# సైబర్ మోసాలపై అలర్ట్.. అప్రమత్తతే ఆయుధం!

సులభంగా డబ్బులు వస్తాయంటే నమ్మొద్దు..

సైబర్ కేటుగాళ్ల వలలో పడొద్దు!

ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ.. సైబర్ మోసాలపై ఎస్పీ హెచ్చరిక



**ఆసిఫాబాద్ , ఆగస్టు 5 ప్రజా జ్యోతి** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సైబర్ జాగృత దివాస్--సురక్షకా తిరంగా' కార్యక్రమంలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని హెచ్ఆర్‌డీ భవనంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, సులభంగా డబ్బులు సంపాదించవచ్చనే ఆశను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని హెచ్చరించారు. పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా నేరాలు, సైబర్ బులీయింగ్, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ స్టాకింగ్ తదితర అంశాలపై వీడియోల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణలో రోజుకు సుమారు రూ.5 కోట్ల వరకు, దేశవ్యాప్తంగా రోజుకు సుమారు రూ.70 కోట్ల వరకు సైబర్ మోసాల కారణంగా ప్రజలు నష్టపోతున్నారని ఎస్పీ తెలిపారు.

**ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ**

గుర్తుతెలియని వ్యక్తులు పంపే ఫైళ్లు, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని ఎస్పీ సూచించారు. బ్యాంకింగ్, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం కూడా భారీ ఆర్థిక నష్టానికి దారితీస్తుందని పేర్కొన్నారు.

**మోసపోతే వెంటనే 1930కు కాల్**

సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే సమీప పోలీస్‌స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని తెలిపారు. గతంలో సైబర్ మోసాలకు గురైన పలువురు బాధితులు తమ అనుభవాలను కార్యక్రమంలో పంచుకున్నారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లను విడుదల చేసి, పాల్గొన్న వారితో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్ఐలు దివ్య, కిరణ్, రాజు, లక్ష్మణ్, నరేష్ తదితర పోలీసు అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన



**సారంగాపూర్,ఆగస్టు 05,ప్రజా జ్యోతి** నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామంలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ ప్రజలకు ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, ఓటీపీ మోసాలు, నకిలీ లోన్ యాప్‌లు, సోషల్ మీడియా మోసాల గురించి వివరించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు ఃఃఃఎఎవతీఃతీఅఎవ.ఁశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని అవగాహన కల్పించారు.కార్యక్రమంలో స్వర్ణ గ్రామ సర్పంచ్ మల్లేష్, ఉప సర్పంచ్ సోహైల్, పోలీసు సిబ్బంది జమీర్, మాధవ్, లింగారం, శ్రీలతతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బి సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసిన ఎమ్మెల్యే రామరావ్ పటేల్

**బాసర ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)** బి సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను హైదరాబాదులో బుధవారం ఎమ్మెల్యే రామరావ్ పటేల్ కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలపై వారిద్దరి మధ్య చర్చ జరిగింది. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి ఎమ్మెల్యే వివరించారు. తానూర్ మండలంలోని బోసి బీసీ సంక్షేమ వసతి గృహ నిర్మాణానికి తక్షణమే కోటీ 70 లక్షల నుంచి రెండు కోట్ల రూపాయల వరకు మంజూరు చేస్తున్నట్లు మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వెల్లడించారు. అదేవిధంగా పలు పనులకు సంబంధించిన అంశాలను చెప్పారు.



## మొండిగుట్టలో శ్రీ యూత్ గణేష్ ఐకాన్ కమిటీ ఏర్పాటు



**మామడ ఆగస్టు 06 ( ప్రజా జ్యోతి)**:మామడ మండలంలోని మొండిగుట్ట గ్రామ యువకులు శ్రీ యూత్ గణేష్ ఐకాన్ కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా రిషికుమార్ (బాలాజీ), క్యాషియర్‌గా బోడా రాహుల్‌ను నియమించినట్లు యూత్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే గ్రామ యువత ఐక్యంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

## తోషం పాఠశాలలో 'ఆరోగ్య పాఠశాల' బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన



**గుడిహత్నూర్, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి)**:మండలంలోని తోషం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమంలో భాగంగా బాలల రక్షణ చట్టాలు, పోక్సో చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం (అదిలాబాద్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సులో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ రవికాంత్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రూప పాల్గొని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కీలక విషయాలపై అవగాహన కల్పించారు.

**కార్యక్రమంలో ముఖ్య విషయాలు:**

**చట్టాలు - సేఫ్టీ:** బాలల రక్షణ చట్టాలు, పోక్సో చట్టం-2012, సేఫ్ టచ్ - అన్ సేఫ్ టచ్, లైంగిక వేధింపుల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలి మరియు ఫిర్యాదు చేసే విధానాలపై పూర్తి వివరాలు అందించారు.

**అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు:** అత్యవసర సమయంలో సాయం కోసం 100, 1098, 181 టోల్ ఫ్రీ నంబర్లను ఉపయోగించాలని, ముఖ్యంగా బాలికలు ఈ నంబర్లను నోట్ చేసి ఉంచుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే పాఠశాలలోని 'గర్ల్ చైల్డ్ ప్రొటెక్షన్ టీచర్' (గర్ల్ ఫ్రెండ్లీ టీచర్) దృష్టికి తీసుకురావాలని తెలిపారు. బాలికలు కరాటే నేర్చుకోవడం ద్వారా శారీరక, మానసిక ధైర్యం పెరుగుతుందని చెప్పారు. పిల్లలు సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో ఉపాధ్యాయులకు పోక్సో చట్టం-2012 మరియు పోక్సో రూల్స్-2020 బాధ్యతలపై స్పష్టత నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నైనీ గని నుంచి సంవత్సరానికి సుమారు 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

**సింగరేణి డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రు**

**నైనీ గని నుంచి రోజుకు 12 వేల టన్నుల బొగ్గు రవాణాకు సింగరేణి సన్నాహాలు**

**ఒడిశాలో ఉన్నతస్థాయి సమీక్ష.. వినియోగదారులు, రవాణా ఏజెన్సీలతో సమావేశం**

**జిల్లా కలెక్టర్, ఎస్పీతో ప్రత్యేక సమావేశం.. రవాణా సమస్యల పరిష్కారానికి చర్యలు**





**మంచిర్యాల, 5,ఆగస్టు (ప్రజాజ్యోతి)**:ఒడిశా రాష్ట్రంలోని సింగరేణి నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తి అవుతున్న బొగ్గును లక్ష్యాలకు అనుగుణంగా రైల్వే సైడింగ్‌లకు, స్థానిక వినియోగదారులకు ప్రతిరోజూ సకాలంలో రవాణా చేయడం, రవాణాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడం, రోజువారీ బొగ్గు తరలింపును మరింత వేగవంతం చేయడం లక్ష్యంగా సింగరేణి ఉన్నతాధికారులు బుధవారం నైనీ గని వద్ద ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సింగరేణి డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిందాల్ స్టీల్, జిందాల్ ఇండియా పవర్ లిమిటెడ్, మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్, తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధులతో పాటు బొగ్గు రవాణా ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్ పోట్రు మాట్లాడుతూ నైనీ గని నుంచి సంవత్సరానికి సుమారు 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి కానుందని తెలిపారు. ఈ బొగ్గును సమీపంలోని విద్యుత్ కేంద్రాలతో పాటు తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి, తమిళనాడు జెన్‌కో విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉన్నందున రవాణా ఏజెన్సీలు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిరోజూ బొగ్గు తరలింపును నిర్వహించాలని సూచించారు. వినియోగదారులు కూడా అవసరమైన మేరకు బొగ్గు స్వీకరణలో చొరవ చూపి సమన్వయంతో ముందుకు రావాలని కోరారు. బి. వెంకన్న మాట్లాడుతూ, రైలు మార్గంలో బొగ్గు రవాణాను మరింత వేగవంతం చేయడానికి సమీపంలోని హిందోల్ రైల్వే సైడింగ్‌తో పాటు కామాఖ్య నగర్ సైడింగ్ వరకు బొగ్గు తరలింపులో ఎలాంటి అంతరాయం లేకుండా రవాణా సంస్థలు పూర్తి సహకారం అందించాలని సూచించారు. దీనిపై వినియోగదారుల ప్రతినిధులు స్పందిస్తూ రోజువారీ కేటాయింపుల మేరకు బొగ్గును స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, రవాణా సంస్థలతో సమన్వయం చేసుకుని సరఫరా ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. రవాణా ఏజెన్సీల ప్రతినిధులు కూడా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బొగ్గు తరలించేందుకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు ఈ సమావేశంలో బొగ్గు రవాణా జరుగుతున్న రహదారులపై కొన్ని ప్రాంతాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, వాటి వల్ల రవాణాపై పడుతున్న ప్రభావం, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం సింగరేణి ఉన్నతాధికారులు అంగూల్ జిల్లా కలెక్టర్ ఎం. అబ్దుల్ అక్తర్, జిల్లా ఎస్పీ రాహుల్ జైన్‌లను ప్రత్యేకంగా కలిసి రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా సజావుగా జరిగేందుకు ప్రభుత్వ యంత్రాంగం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. దీనిపై జిల్లా అధికారులు సానుకూలంగా స్పందిస్తూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రోజుకు కనీసం 12 వేల టన్నుల బొగ్గు రవాణా లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం కార్యాచరణ రూపొందించింది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు వినియోగదారులు, బొగ్గు రవాణా ఏజెన్సీలు, స్థానిక యంత్రాంగం పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఏరియా అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశించారు. అంతకుముందు గౌతమ్ పోట్రు, బి. వెంకన్న నైనీ బొగ్గు గనిని సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ, గనిలో నిర్వహిస్తున్న పనులు, రవాణా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నైనీ ఏరియా జనరల్ మేనేజర్ డి. బైద్యతో పాటు ఇతర సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలిస్తున్న భైంసా ప్రజావాణి

**జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల కౌన్సిలింగ్‌తో ఒక్కటైన దంపతులు**

**ఫిర్యాదుదారులతో కిటకిటలాడిన భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయం**



**నిర్మల జిల్లా ప్రతినిధి ,ఆగష్టు 5 ,( ప్రజాజ్యోతి )**నిర్మల్ జిల్లా లోని భైంసా ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల పిటిషనర్ దారులతో భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయం కిటకిట లాడింది.అనేక మంది ఫిర్యాదుదారులు తరలివచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా ఎస్పీ స్వీకరించి, వారి సమస్యలను ఓర్పుతో విన్నారు.ఈ సందర్భంగా కుటుంబ కలహాలతో వేర్వేరుగా ఉంటున్న ఓ దంపతులకు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. వారి సమస్యలను శ్రద్ధగా విని, పరస్పర అవగాహన, కుటుంబ బంధాల విలువను వివరించి, కలిసి జీవించాలని సూచించారు.ఎస్పీ సూచనలు, కౌన్సిలింగ్‌తో ఆ దంపతులు తమ విభేదాలను పక్కనపెట్టి మళ్లీ కలిసి ఒక్కటయ్యేందుకు అంగీకరించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి, బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చట్ట పరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా తమ సమస్యలను నేరుగా వినిపించుకునే అవకాశం కల్పించినందుకు ఫిర్యాదుదారులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# సుగుణక్కపై ఆరోపణలు సరికాదు

## కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ.. ప్రజల నమ్మకాన్ని గెలుచుకుంటున్న నిజమైన ప్రజానాయకురాలు

## అధిష్టానానికి కట్టుబడి పనిచేయాలి.. గాంధీభవన్ వద్ద రాద్ధాంతం చేయడం సరికాదు

**ఆసిఫాబాద్, ఆగస్టు 5 ప్రజా జ్యోతి** కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కపై కొంతమంది నాయకులు చేస్తున్న ఆరోపణలు, విమర్శలు పూర్తిగా సరికావని యువజన కాంగ్రెస్ వాంకిడి మండల అధ్యక్షుడు ఉప్పుల క్రిష్ణ అన్నారు. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా రోడ్డుపైకి తీసుకురావడం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని, ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ అధిష్ఠానం నిర్ణయాలను గౌరవిస్తూ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటీవల కొంతమంది నాయకులు గాంధీభవన్ వద్ద నిర్వహించిన ఆందోళన నేపథ్యంలో ఉప్పుల క్రిష్ణ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబం లాంటిదని, పార్టీలో చిన్నచిన్న అభిప్రాయ భేదాలు ఉంటే వాటిని పార్టీ అంతర్గత వేదికలపై చర్చించుకుని పరిష్కరించు కోవాల ని సూచించారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీ నా యకత్వంపై బహిరంగంగా విమర్శలు చేయడం, నిరసనలు చేపట్ట డం వల్ల పార్టీ శ్రేణుల్లో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు.

### పదవికంటే ప్రజా సేవకే ప్రాధాన్యం

ఆత్రం సుగుణక్కకు పదవి, వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధానమని ఉప్పుల క్రిష్ణ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం వంటి కార్యక్రమాలకు ఆమె ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకునే నాయకత్వమే ప్రజలకు దగ్గరవుతుందని, అదే విధంగా సుగుణక్క ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం, వారి సమస్యలపై స్పందించడం, అవసరమైన సందర్భాల్లో అధికారులను కలిసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చేయడం ఆమె రాజకీయ విధానంలో భాగమని అన్నారు.

### గిరిజనుల హక్కుల కోసం నిరంతర పోరాటం

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన ప్రాంతం కావడంతో ఆదివాసీ, గిరిజనుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఉప్పుల క్రిష్ణ అన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, మౌలిక సదుపాయాల వంటి అంశాలపై సుగుణక్క నిరంతరం స్పందిస్తున్నారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రజల సమస్యలను రాజకీయ అంశంగా కాకుండా బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్న నాయకత్వాన్ని పార్టీ కార్యకర్తలు, ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు.

### పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకత్వం

జిల్లాలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు సుగుణక్క నాయకత్వంలో పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయని ఉప్పుల క్రిష్ణ పేర్కొన్నారు. మండలాలు, గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, ప్రజలకు అందాల్సిన హక్కులు, సౌకర్యాల కోసం పార్టీ నాయకులు పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ దిశగా జిల్లా కాంగ్రెస్ నాయకత్వం కృషి చేస్తోందని చెప్పారు.

### గాంధీభవన్ వద్ద ఆందోళన సరికాదు

పార్టీలో ఎవరికైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉందని ఉప్పుల క్రిష్ణ అన్నారు. అయితే గాంధీభవన్ వంటి పార్టీ ప్రధాన కార్యాలయం వద్దకు వెళ్లి బహిరంగంగా ఆందోళనలు చేయడం, పార్టీ నాయకత్వంపై ఆరోపణలు చేయడం వల్ల సమస్య పరిష్కారం కాకపోగా పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినే అవకాశం ఉందన్నారు. పార్టీకి సంబంధించిన అంశాలను బహిరంగంగా చర్చించడం వల్ల ప్రత్యర్థి పార్టీలకు అవకాశం కల్పించినట్లవుతుందని, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య కూడా అపోహలు ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దల సమక్షంలో చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించారు.



### అధిష్ఠానం నిర్ణయాలను గౌరవించాలి

కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలను ప్రతి నాయకుడు, కార్యకర్త గౌరవించాలని ఉప్పుల క్రిష్ణ అన్నారు. పార్టీ పదవులు అనేవి శాశ్వతం కాదని, పార్టీ కోసం పనిచేసే అవకాశం మాత్రమేనని పేర్కొన్నారు. వ్యక్తిగత పదవుల కోసం కాకుండా పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. పార్టీలో సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేస్తేనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు.

### కార్యకర్తలే పార్టీకి బలం

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని ఉప్పుల క్రిష్ణ అన్నారు. గ్రామస్థాయిలో పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల సమస్యలను నాయకత్వం గుర్తించి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకుల మధ్య విభేదాలు బహిరంగంగా కనిపిస్తే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తల్లో నిరుత్సాహం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. అందుకే నాయకులంతా సమన్వయంతో పనిచేస్తూ కార్యకర్తలకు ధైర్యం కల్పించాలని కోరారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తను గౌరవిస్తూ, వారి సేవలను గుర్తిస్తూ ముందుకు సాగాలని అన్నారు.

### వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యం

వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరించడం ఎవరికి మంచిది కాదని ఉప్పుల క్రిష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు. పార్టీలో ఎవరైనా తమ అభిప్రాయాలను చెప్పవచ్చని, అయితే పార్టీ క్రమశిక్షణకు లోబడి వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అధిష్ఠానానికి వ్యతిరేకంగా బహిరంగ ప్రకటనలు చేయడం, నిరసనలు చేపట్టడం కంటే పార్టీ అంతర్గతంగా సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమమని సూచించారు.

### ప్రజల విశ్వాసమే సుగుణక్కకు బలం

ఆత్రం సుగుణక్క ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై స్పందిస్తున్నారని, అందుకే ప్రజల్లో ఆమెకు మంచి గుర్తింపు లభించిందని ఉప్పుల క్రిష్ణ అన్నారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వంగా ఆమె ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను వినడం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారం కోసం ప్రయత్నించడం వంటి కార్యక్రమాలతో ప్రజల నమ్మకాన్ని పొందుతున్నారని అన్నారు. అలాంటి నాయకత్వంపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

### ఐక్యతతోనే కాంగ్రెస్ బలోపేతం

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పనిచేయాలని ఉప్పుల క్రిష్ణ పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి నాయకుడిని గౌరవిస్తూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని చెప్పారు. "పార్టీ కోసం పనిచేసే ప్రతి నాయకుడిని గౌరవించాలి. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. అధిష్ఠానం నిర్ణయాలను గౌరవిస్తూ, ప్రజల సమస్యలను ఎజెండాగా చేసుకుని ముందుకు సాగాలి. గాంధీభవన్ వద్ద రాద్ధాంతం చేయడం ద్వారా ఎవరికీ ప్రయోజనం ఉండదు. పార్టీ ఐక్యతను కాపాడుకోవడం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత" అని యువజన కాంగ్రెస్ వాంకిడి మండల అధ్యక్షుడు ఉప్పుల క్రిష్ణ అన్నారు.

# సమృద్ధిగా వర్షాలు పడితేనే సదర్మాట్ రైతాంగానికి సాగునీరు అందిస్తాం

### అటవీ శాఖ అధికారులు బెదిరింపులు మానుకోవాలి అర్హులకే అంగన్వాడీ పోస్టులు.. పైరవీలకు తావులేదు

### ఖానాపూర్ పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెల్లడి





**ఖానాపూర్, ఆగస్టు 5 ( ప్రజా జ్యోతి )** ఈ ప్రాంత రైతాంగం సదర్మాట్ సాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదని, రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తేనే సదర్మాట్, కడెం ప్రాజెక్టు కు సాగునీటి ని వదిలే అవకాశం ఉందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. మొదట సరైన వర్షాధారం లేదని వాతావరణం దృశ్య ప్రకటిస్తూనే ఆరు తొడల పంటలు వేయాలని ప్రభుత్వం కోరింది అన్నారు ఇటువంటి భారీ వర్షాలతో ప్రాజెక్టులు నిండిన వాటిని ముందస్తు చర్యగా సాగునీరు కాకుండా తాగునీటి కోసమైనా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు ఒకవేళ వర్షాలు సమృద్ధిగా పడితే తప్పకుండా రైతన్న గారికి మీరు ఇచ్చే విషయాన్ని ఆలోచిస్తామన్నారు ఖానాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సమీక్ష సమావేశం ఎంపీడీవో రాథోడ్ రాధా ఆధ్వర్యంలో జరిగింది ఇందులో మండల స్థాయిలోని సర్పంచులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జులై లో కొద్దిపాటి వర్షం పడిందని, కనీసం గ్రౌండు వాటర్ కూడా పెరగలేదని, ఇలా అయితే వేసవిలో ఇబ్బంది అవుతుందని, ఇప్పుడు ప్రాజెక్టు లో నిల్వ ఉన్న వాటర్ భవిష్యత్ లో తాగునీటి కోసం అవసరం ఉంటుందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలలో మళ్ళీ వర్షాలు పడితేనే సాగునీరు వదిలే అవకాశం ఉంటుందని, ఈ విషయం రైతులు గమనించి సహకరించాలని కోరారు. అటవీశాఖ పై జరిగిన చర్చలో అధికారుల పనితీరు పైన ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్ ఇందిరమ్మ ఇండ్లు కట్టకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. మీకేమి ప్రాబ్లమ్ అవుతుందని అన్నారు. బావాపూర్ (ఆర్) లో మిషన్ భగీరథ బావి నుండి, వ్యవసాయ బావులనుండి నల్ల మట్టి కనీసం పూడిక తీత ను తీయకుండా ఇబ్బంది పెడుతున్నారని సర్పంచ్ భర్త ఆరోపించారు. బఫర్ జోన్ లో ఇండ్లు కట్టుకోవచ్చుని కలెక్టర్ కూడా ఆదేశాల ఇచ్చారని ఎంపీడీఓ రాధా తెలిపారు. అటవీ అధికారులు ఇలా చేస్తే ప్రజల నుండి తిరుగుబాటు వస్తుందని అధికారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. త్వరలో ఖానాపూర్ నుండి బెల్లాల్ వరకు ఆర్ అండ్ బీ రోడ్డు పనులు జరుగనున్నాయని, నియోజకవర్గం లో పలు గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ పోస్టుల విషయంలో అర్హులకే ఇవ్వటం జరుగుతుందని, అనవసరంగా పైరవీలు చేయవద్దని, గత ప్రభుత్వ పరిస్థితి ప్రస్తుతం లేదని సత్తనపెల్లి లో చాలా చోట్ల రోడ్డు దెబ్బతిందని వెంటనే మరమ్మత్తులు చేయించాలని సర్పంచ్ భర్త గోపి నాయక్ కోరారు. అధికారులు గ్రామాలకు వెళ్లితే ముందుగా అక్కడ సర్పంచ్ కు సమాచారం ఇవ్వాలని అయితేనే సమస్యలు తెలుస్తుందని, సర్పంచ్ లు చెప్పిన సమస్యలు పరిష్కారం చేయవలసి ఉంటుందని ఎమ్మెల్యే అధికారులతో అన్నారు. గోడలపంపు లో స్మశాన వాటిక గాలి వర్షాలకు కూలిపోయిందని వెంటనే పనులు చేయించాలని సర్పంచ్ పంబాల నాగవ్వ కోరారు. మండల సమావేశానికి రాని అధికారుల పైన ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. సంబంధించిన శాఖల అధికారులంత్ వస్తేనే గ్రామ సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశానికి రాని అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓ రాదను ను ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటం మంచిది కాదని హితవు చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్యం విషయంలో అలసత్వం చేయవద్దని, జలసిరి పథకం ద్వారా వందశాతం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, విద్యా, వైద్యం, వ్యవసాయం ముఖ్యం అని అధికారులు వివిధ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో దేవిదాస్, ఎంపీడీఓ రాథోడ్ రాధ, తహసీల్దార్ సుజాతరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ భూషణ్ ఆత్మ చైర్మన్ తోట సత్యం, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. ప్రతి 45రోజులకు ఒసారి సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రాధా తెలిపారు

## పోలింగ్ కేంద్రాల హేతు బద్ధీ కరణ ప్రక్రియ పక్కాగా చేప ట్టాలి

జిల్లా కలేక్టర్ రాజర్షి షా





**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 5,( ప్రజాజ్యోతి )**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ --2026 ప్రక్రియలో భాగంగా జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10 న రేషనలైజేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేసి, 17న ముసాయిదా జాబితాను ప్రచురిస్తామన్నారు. 17 నుంచి సెప్టెంబరు 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరించి, అక్టోబరు 19న తుది జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బిఎల్‌ఓ, బిఎల్‌ఏల సమావేశాలు నిర్వహించి, ఆ వివరాలను బి ఎ ల్ ఓ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటైజేషన్ జిల్లావ్యాప్తంగా 99.47 శాతానికి చేరిందని, ఇందులో ఆదిలాబాద్ నియోజక వర్గం లో 99.01 శాతం, బోథ్ పరిధిలో వంద శాతం పూర్తయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌డిడి (మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, నకిలీ ఓటర్లు) వివరాలతో పాటు కేంద్రాల పునర్వ్యవస్థీకరణపై వివిధ పార్టీల నేతల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు.ఈ సమావేశంలో ఆర్డీఓ జగదీశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్లుగా పదోన్నతులు లేక జేఎంఈటీ సూపర్‌వైజర్ ఉద్యోగుల శ్రమ దోపిడీ

జేఎంఈటీల రిలే దీక్షలకు, ధర్నాలకు ఐఎన్‌టీయూసీ సంపూర్ణ మద్దతు



**మంచిర్యాల, 5,ఆగస్టు (ప్రజాజ్యోతి):**సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న జేఎంఈటీ (జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ) ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు, ధర్నాలకు ఐఎన్‌టీయూసీ పూర్తి సంఘీభావం ప్రకటించింది. జేఎంఈటీ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ సంఘం అండగా నిలుస్తుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఐఎన్‌టీయూసీ సింగరేణి మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి పి. తిరుపతి రాజు, మైనింగ్ స్టాఫ్ జనరల్ సెక్రటరీ మారెపెల్లి బాపు తెలిపారు. వారు మాట్లాడుతూ 2016--17 బ్యాచ్‌కు చెందిన జేఎంఈటీ ఉద్యోగులు దాదాపు పదేళ్లుగా సింగరేణి సంస్థలో సేవలందిస్తున్నప్పటికీ, నిబంధనల ప్రకారం మూడేళ్లలో ఇవ్వాల్సిన ఓవర్‌మ్యాన్ (సూపర్‌వైజర్) పదోన్నతులు ఇప్పటికీ కల్పించకుండా "ఖాళీలు లేవు" అనే సాకుతో యాజమాన్యం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఒకవైపు ఖాళీలు లేవని చెబుతూ, మరోవైపు అదే జేఎంఈటీ ఉద్యోగులతో ఓవర్‌మ్యాన్ బాధ్యతలు నిర్వర్తింపజేయడం యాజమాన్యం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. పదోన్నతులు, వేతన ప్రయోజనాలు కల్పించకుండా పూర్తి బాధ్యతలు అప్పగించడమే కాకుండా గనుల్లో జరిగే ప్రమాదాలకు వారినే బాధ్యులను చేయడం తీవ్ర అన్యాయమన్నారు. జేఎంఈటీ ఉద్యోగులను మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురిచేస్తూ బానిసల్లా పనిచేయించుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. జేఎంఈటీ ఉద్యోగుల పట్ల యాజమాన్యం అవలంబిస్తున్న మొండి వైఖరిని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల ప్రకారం వారికి రావాల్సిన హక్కులు, పదోన్నతులు, ఇతర న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని స్థాయిల్లో నిరంతరం పోరాడుతామని డాక్టర్ బి. జనక్ ప్రసాద్ స్పష్టం చేశారని తెలిపారు. ఇకనైనా సింగరేణి యాజమాన్యం స్పందించి జేఎంఈటీ ఉద్యోగుల కు నిబంధనల ప్రకారం తక్షణమే ఓవర్‌మ్యాన్ (సూపర్‌వైజర్) పదోన్నతులు కల్పించి, వారికి జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే సరిదిద్దాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు, కేంద్ర నాయకులు గరిగ స్వామి, ల్యాగల శ్రీనివాస్, చాట్ల అశోక్, పి. మల్లారెడ్డి, ఆర్. గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి అదిలాబాద్ జిల్లా స్థాయి ఎస్సీ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలి

**రాష్ట్ర ఉపాధ్యక్షులు సమతా సుదర్శన్**



**ఖానాపూర్ ఆగస్టు 5( ప్రజా జ్యోతి)** ఉమ్మడి అదిలాబాద్ జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీఎస్సీ సామాజిక వర్గ కార్యవర్గ సమావేశం ఈనెల వదినని రాష్ట్ర ఉపాధ్యక్షులు సమతా సుదర్శన్ తెలిపారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎస్సీ డిపార్ట్మెంట్ కార్యక సభ్యులను కోరారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడల్పు పటేల్ ను ఆహ్వానించేందుకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా పదాధికారులు నియోజకవర్గ అధ్యక్షులు పాల్గొని ఈ విశృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కట్ట శ్యాంసుందర్ రాష్ట్ర సెక్రటరీ కొంతం గణేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసమల్ల అశోక్ ఖానాపూర్ మండల అధ్యక్షులు సంఘర్ణి రాజన్న ముధోల్ నియోజకవర్గ అధ్యక్షులు జంగ్మే సాహెబ్ రావ్ డి సి సి కార్యవర్గ సభ్యులు జన్నారపు శంకర్ పట్టణ అధ్యక్షులుగొరె గంగాధర్ సీనియర్ నాయకులు నేత శ్యామ్ ద్యావతి రాజేశ్వర్ మ్యాదరి రాజేశ్వర్ మెన సతీష్ తదితరులు పాల్గొన్నారు

## సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు




**మందమర్రి, టౌన్ ఆగస్టు 05 ప్రజా జ్యోతి** రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు, మందమర్రి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక మదర్ తెరెసా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం (" సైబర్ క్రైమ్")(ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్) నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారు లు మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు ఎల్లప్పు డూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లేదా లింక్‌లను క్లిక్ చేయకూ దదని అవగాహన కల్పించారు. ఏవైనా సైబర్ మోసాలు జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు గానీ, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లేష్, కానిస్టేబుల్స్ సంతోష్, విశ్వనాథ్, సురేందర్, హోంగార్డు శ్రావణ్ కుమార్ పాఠశాల యాజమాన్యం, డైరెక్టర్ బరిగెల సతీష్ బబ్బెర లక్ష్మణ్ స్కూల్ సిబ్బంది ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన ఎంపీఓ అజీజ్ ఖాన్ సార్



**సారంగాపూర్, ఆగస్టు 5:** ప్రజా జ్యోతి మండలంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీఓ అజీజ్ ఖాన్ మంగళ వారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.తాండ్ర (జీ) గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సందర్శించి పనుల పురోగతిని, నాణ్యతను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీఓ అజిత్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నాణ్య తా ప్రమాణాలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయా లని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో గ్రామ సర్పంచ్ కొప్పుల వెన్నెల నర్సయ్య, పంచాయతీ సెక్రెటరీ రఘు కిరణ్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువులకు శ్రీరామరక్ష

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, ఆగస్టు 5, (ప్రజా జ్యోతి)** నవజాత శిశువుల ఆరోగ్యం, శారీరక, మానసిక వికాసానికి తల్లిపాలు ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం రిమ్స్ ఆస్పత్రి నుండి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టేడియం లో మెడికల్ కళాశాల విద్యార్థులు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు నాటికలు, పాటల ద్వారా తల్లిపాల విశిష్టతపై ప్రజల్లో చైతన్యం తెచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిడ్డ పు ట్టిన మొదటి ఆరు నెలల వ రకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని స్పష్టం చేశారు. ముర్రుపాలలో ఉండే యాంటీబాడీలు శిశువుకు అవసరమైన రోగనిరోధక శక్తిని అందిస్తాయన్నారు. కొన్ని గిరిజన గ్రామాలు, తండాల్లో తల్లిపాలు సరిగ్గా రాక పోతే ఆవు పాలు, తేనె వంటివి పట్టిస్తున్నారని, దీనివల్ల శిశువులకు ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పాలు పడని సమయంలో తల్లిబిడ్డల చర్మానికి చర్మం తగిలేలా చేసే 'కంగారూ మదర్ కేర్' వల్ల ప్రకృతి సిద్ధంగా తల్లిపాలు పడతాయని, రిమ్స్‌లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ఈ విషయంలో తల్లితో పాటు భర్త, అత్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. ఐ సీ ఎం ఆర్ 'సంకల్ప్' ప్రోగ్రామ్ ద్వారా నవజాత శిశు మరణాల రేటును తగ్గించగలిగామని, మెదడు వికాసానికి బిడ్డ పుట్టిన మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు అనంతరం వారోత్సవాల సందర్భంగా వైద్య కళాశాల విద్యార్థుల కు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యా రోగ్యశాఖ అధికారి డా.సాధన, రిమ్స్ డైరె క్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు వెంకట్ రెడ్డి, అశోక్, వైద్యశాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

## లకంపూర్ లో దోమల నివారణ మందు పిచికారీ

**--వర్షాకాలంలో వ్యాధుల నివారణకు గ్రామ పంచాయతీ ముందస్తు చర్యలు**



**నేరడిగొండ, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):**మండలంలోని లకంపూర్ గ్రామంలో పెరుగుతున్న దోమల బెడదను అరికట్టేందుకు గ్రామ సర్పంచ్ సెడ్మకి సుజాత గంగాధర్ ఆధ్వర్యంలో బుధవారం దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, మురుగు కాలువలతో పాటు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ప్రత్యేకంగా మందును పిచికారీ చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున గ్రామస్తుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు. ఇలాంటి ఆరోగ్య పరిరక్షణ చర్యలను తరచూ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు

**ఆగస్టు 9 వేడుకలను విజయవంతం చేయాలని ఆదివాసి నాయకుల పిలుపు**



**నేరడిగొండ ఆగస్టు 05 ( ప్రజా జ్యోతి ) :** ప్రపంచ ఆదివాసి దినోత్సవం విజయవంతం చేయాలని మండల కేంద్రంలోని కుమరం భీమ్ భవనం నందు లకం పూర్ సార్ మేడి ఆధ్వర్యంలో ఆదివాసి గ్రామాల పటేల్‌ల సమక్షంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడుతూ ప్రతి ఆదివాసి గ్రామాలలో ఆగస్టు 9 ఆదివారం రోజున ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణ చేసి తదుపరి మండలంలోని కొమరం భీమ్ భవనం నందు సమయం ఉదయం 11 గంటల 30 నిమిషాలకు జెండా ఆవిష్కరణ ఉంటుందని కాబట్టి ఆయా గ్రామాల పటేళ్లు దేవారి మహాజనులు ఉద్యోగస్తులు విద్యార్థులు మహిళలు మేధావులు వివిధ గ్రామాల సర్పంచ్ లు 9 తెగల కుల పెద్దలు సకాలంలో హాజరు కావాలని రాయి సెంటర్ సార్ మేడి ఆత్రం గంగారం పిలుపునిచ్చారు ఈ పండుగను సంస్కృతి సాంప్రదాయాల ప్రతిబింబించేలా ఉత్సాహంగా జరుపుకోవాలని మాట్లాడారు ఈ కార్యక్రమంలో సార్ మేడి ఆత్రం గంగారం, మండాడి భీమ్రావు, సోనేరావు గౌరవ అధ్యక్షులు, అత్రం నగేష్ ,సర్పంచ్‌లు మండాడి కృష్ణ, తోడసం శంకర్, మల్లేష్, గంగారం, అలాగే కొట్నాక్ కోటేశ్వర్ , శంబన్న తదితరులు పాల్గొన్నారు.

## బాసర పరిధిలో లాడ్జిలపై సామాజిక తనిఖీలు




**బాసర ఆగస్టు 5 ( ప్రజాజ్యోతి)** నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్ బాసర చుట్టుపక్కల ప్రాంతాల్లోని పలు లాడ్జిలలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ సీఐ రవీందర్ నాయక్, బాసర సీఐ దీపక్ తదితర పోలీసులు పాల్గొన్నారు. లాడ్జిలను సందర్శించి గదుల రిజిస్టర్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులకు గదులు ఇచ్చేటప్పుడు ఆధార్ కార్డులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని, అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్రమాలకు ఆశ్రయమిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ హెచ్చరించారు. ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని లాడ్జి నిర్వాహకులకు సూచించారు.

## ఇక ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

### హర్షం వ్యక్తం చేసిన మండల ప్రజలు




**ఖానాపూర్ ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రజా సమస్యల్ని పరిష్కార దిశలో ప్రతి సోమవారం జిల్లాలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఇక ప్రతి మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు అయితే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాలతో పాటు డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి అన్ని మండల కేంద్రాల్లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ మండల స్థాయికి చెందిన 23 మంది వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశాలు జారీ చేశారు ప్రతి ఫిర్యాదును కంప్యూటర్లో క్రోడీకరించి ఫిర్యాదు దారుణకి రసీదు కూడా ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది ఈ నిర్మల్ జిల్లాలోని 18 మండల ల స్థాయిలోని ఎంపీడీవోల ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించడం జరుగుతుంది ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం తప్పకుండా నిర్వహించాలన్న విషయాన్ని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది దీంతో మండల స్థాయి ప్రజలు దూర భారం తగ్గి సమస్యలు వెంట వెంటనే పరిష్కరించడానికి ఆస్కారం ఉంటుందని మండల ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# ఆపత్కాలంలో కాంగ్రెస్ పార్టీ జెండాను భుజాన మోసినప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

### ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు నరేష్ జాదవ్

### చిక్ మాన్ ప్రాజెక్ట్ ఆధునీక రణకు కృషి చేస్తాం మాజీ ఎంపీ సోయం బాపూరావు

### సిరికొండ మండల కాంగ్రెస్ కమిటి విస్తృత స్థాయి సమావేశం





**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 5, (ప్రజా జ్యోతి )** ఆపత్కాలంలో పార్టీకి అండగా నిలిచి జెండా మోసిన వారికి తప్పకుండాన్యాయం చేస్తామని, ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టతకు మరింత నడుము బిగించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుడు నరేష్ జాదవ్ పిలు పు నిచ్చారు. సిరికొండ మండల కాంగ్రెస్ కమిటి అధ్య క్షుడు కంచెం లక్ష్మణ్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్ర మంలోజిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు డా.నరేశ్ జాదవ్, మాజీ ఎంపీసోయం బాపూరావు ముఖ్యఅథితిగా హాజరయ్యారు.ఏఐసిసి టిపిసిసి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్ర మంలో భాగంగా జిల్లాలో విస్తృత పర్యటన చేస్తున్న డా నరేష్ జాదవ్ మాజీ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు, బోథ్ నియోజక వర్గం ఇంచార్జి ఆడే గజేందర్‌లతో కలిసి ఆదిలాబాద్ పిఎసి సబ్యులు ఏలేటి అశ్విన్ రెడ్డి,మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్య క్షుడుసాజిద్ ఖాన్,ఇచ్చోడ మార్కెట్ కమిటి ఛైర్మన్, జిల్లా అదికార ప్రతినిది సత్య వతీ కోటేశ్వర్,టీపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ కు ర్మేమహేందర్, జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ కమి టి ఓబీసీ సెల్ చైర్మన్ అంబ కంటి అశోక్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షుడు సుదగోని సుధాకర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రదాన కార్యదర్శి బండి. దేవిదాష్ చారి,మల్యాల కరుణాకర్, లక్ష్మారెడ్డి, బోథ్ నియోజకవ ర్గ మండల కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మెరుగుభోజన్న, తొడసం దౌలత్ రావ్, గాజుల పోతన్న, మాజీ జిల్లా కాం గ్రెస్ కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్, భూపెల్లి శ్రీధర్ మాజీ టీ టీడీ బోర్డు మెంబెర్ బెజ్జంకి అనిల్, జిల్లా కాంగ్రెస్ కార్య దర్శిలు షేక్. ఇమామ్,కాడే. సంతోష్,సిరికొండ మాజీ జ డ్పీటీసీ చంద్రకళ రఘు రామ్, బద్దం పురుషోత్తం రెడ్డి, సేవాదళ్ జిల్లా కార్యదర్శి అఫ్సర్ ఖాన్,యువజన కాంగ్రె స్ బోథ్ అసెంబ్లీ ప్రెసిడెంట్ బద్దం పోతారెడ్డి,యువజన కాంగ్రెస్ కమిటి వైస్ ప్రెసిడెంట్ గుడాల అనీష్,సిరికొండ సర్పంచ్ బొడ్డు.దత్తాత్రేయ,మాజీ కాంగ్రెస్ సిరికొండ మండల ప్రెసిడెంట్ షేక్. ఇమామ్ షేక్ బసిర్,రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సం ఘటన్ సిరికొండ మండలం అధ్యక్షుడు కుర్మే సదానందం, సిరిచెల్మ సర్పంచ్ రవి, సిరికొండ మండల 16 మంది సర్పంచ్ లు, నాయకులు ఈశ్వర్, సిడాం కృష్ణా, సిరిచె ల్మ ఉప సర్పంచ్ అజీమ్ సు ల్తాన్, సిరికొండ మండల ఉససర్పంచ్ ల సంఘం అద్య క్షుడు తోకలరాజు, ఉపసర్పంచ్‌లు, మాజీ ఎంపీ టీసీ లు, మాజీ జడ్పీటీసీ లు, మాజీ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. బుదవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం, సిరికొండ మండల కేంద్రం లోని గాంధీ చౌరస్తాలో మండల కాంగ్రెస్ కమిటి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు డా.నరేష్ జాదవ్ మాట్లాడుతూ నూతన మండల కమిటీల నియా మకంలో ఎలాంటి వర్గ విభే దాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని పోవాలని, సామాజిక న్యాయం పాటిస్తూ పారదర్శకంగా కమి టీలను సిద్ధం చేయాలని సూచించారు.ప్రతి మండల కమిటీలో మండల అధ్యక్షునితో కలిపి మొత్తం 21 మంది సభ్యులు ఉండాలని, ఇందులో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు (జనరల్ సెక్రటరీలు), ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉం డేలా చూడాలని స్పష్టం చే శారు. పార్టీ కమిటీలలో మ హిళా నాయకులకు, కార్యక ర్తలకు తగిన ప్రాధాన్యత క ల్పించాలన్నారు. సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీ సీలు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ల అనుభవాన్ని ఉప యోగించుకునేలా ప్రతి మండలంలో 'పొలిటికల్ అఫైర్స్ కమిటీ' (పిఎసి)ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలస్థాయి కమిటీ, గ్రామస్థాయి కమిటీలు, బూత్ స్థాయి, కమిటీలు ఏర్పాటు ప్రక్రియను ఆగస్టు 15 లోగా పూర్తి చేయాలని గడువు విధించారు. పార్టీ అభివృద్ధికి, ప్రజల సమస్యలపై అంకితభావంతో పని చేసే ప్రతి నాయకుడిని, కా ర్యకర్తను పార్టీ అధిష్టానం ఖచ్చితంగా గుర్తించి తగిన గౌరవం అందిస్తుందని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ విజయం సాధిస్తుందని ప్రతి కార్యకర్త నడుం బిగించి కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. చిక్మాన్ ప్రాజెక్ట్ కృషి చేస్తానని ముంపు ప్రాంతం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పా ల్గొన్నారు.

## ముర్రుపాలె బిడ్డకు శ్రీరామరక్ష

### అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న



**లక్ష్మణ చాంద, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)** ముర్రుపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న, అన్నారు. తల్లిపాలు వెలకట్టలేని వని బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని తల్లి తొలిసారి ఇచ్చే ముర్రు పాలలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, వీటిలో విటమిన్లు ప్రోటీన్లు లభిస్తాయని, జీర్ణ వ్యవస్థ బాగా పనిచేసి పొట్ట సమస్యలు రాకుండా చేస్తాయని అన్నారు. గర్భవతులకు నార్మల్ డెలివరీకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓస కవిత రాజు, హెల్త్ సూపర్వైజర్ సత్యమ్మ, వరల్డ్ కోఆర్డినేటర్ బ్రహ్మన్న, హెల్త్ అసిస్టెంట్ భాగ్య రేఖ, అంగన్వాడీలు పద్మ, ప్రేమ లత, వరలక్ష్మి, ప్రేమల, రాజమణి, ఆశ కార్యకర్తలు శారద, లక్ష్మి, తల్లులు, గర్భిణీలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల యందు గ్రామసభలు



లక్ష్మణ చాంద, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి) మండల కేంద్రంలో బుధవారం రోజున ముని పెల్లి, మల్లాపూర్, ధర్మారం గ్రామల లోని గ్రామపంచాయతీలలో గ్రామసభలను నిర్వహించారు. వ్యవసాయ అధికారి నాగరాజు రైతులతో మాట్లాడుతూ సూపర్ ఎల్ నినో కారణంగా వర్షాలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ఆయిల్ ఫామ్ వంటి పంటలను పండించుకోవాలని రైతులకు సూచించారు. అలాగే యూరియా బుకింగ్, ఫార్మర్ రిజిస్ట్రేషన్, ఆయిల్ ఫాం పంట వేస్తే రైతులకు వచ్చే లాభాల గురించి రైతులకు వివరించారు. వారి సూచనల మేరకు ముని పెల్లి గ్రామంలో10 మంది రైతులు 23 ఎకరాల ఆయిల్ ఫామ్ పంట ను ప్రోత్సహించారు. వీరితోపాటు మల్లాపూర్ గ్రామంలో 3 మంది రైతులు 10.09 ఎకరాలలో ఆయిల్ఫాం పంటను పండిస్తామన్నారు. అలాగే ధర్మారం గ్రామంలో 3 మంది రైతులు7.10 ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంటను పెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగరాజు, ముని పెల్లి గ్రామ సర్పంచ్ మేడిపల్లి సునీత గంగాధర్, ఉప సర్పంచ్ రంజిత్ రెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ సప్ప భీమేష్, ధర్మారం సర్పంచ్ బుర్కముత్యం, ఉప సర్పంచ్ ఉదయశ్రీ, మాజీ సర్పంచ్ రాజేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి సుస్మిత, ఆయిల్ ఫామ్ క్లస్టర్ విష్ణు, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ఓట్ల సర్వే పూర్తి చేయాలి, గ్రామాల సమస్యల పరిష్కారంలో ముందు ఉండాలి

**మండల సర్పంచ్ లతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక సమావేశం**



ఖానాపూర్ ఆగస్టు 5 (ప్రజా జ్యోతి ) ఎస్ ఐ ఆర్ ఓట్ల సర్వే సవరణలు 100% పూర్తిచేసి గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ముందు ఉంటూ బాధ్యత విధంగా పనులు నిర్వహించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల సర్పంచులతో ప్రత్యేక సమావేశం బుధవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నిర్వహించారు గ్రామాల్లోని పురుగుడిసేలను గుర్తించడంలో అధికారులకు సహకరించాలి,పూరి గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని అన్నారు వర్ష కాలంలో తలెత్తే వ్యాధులు,ఇబ్బందుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తు ఎప్పటికప్పుడు వైద్య సహాయకులకు తెలియజేసి చికిత్స అందించాలన్నారు గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్కారానికి కృషి చెయ్యాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 50 ఏళ్ల నిరీక్షణకు తెర..

**కలెక్టర్ ప్రత్యేక చొరవతో రై తుకు 4 ఎకరాల భూమి కే టాయింపు**



ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 5, (ప్రజా జ్యోతి ) ఏళ్ల తరబడి సాగు చేసు కుంటున్న భూమికి హక్కు పత్రాలు లేక ఇబ్బంది పడు తున్న రైతు కుటుంబానికి ఎట్టకేలకు న్యాయం జరిగింది. మేడిగూడకు చెందిన భావనే పార్వతీబాయికి సాత్నాల మండల పరిధిలోని మాంగుర్ల శివారులోని 35 సర్వే నంబరులో పట్టా ఇచ్చిన ప్పటికీ క్షేత్రస్థాయిలో స్వాధీనం చూపలేదు. ఈ విషయాన్ని అధికారులు జిల్లా కలెక్టర్ రాజర్షిషా దృష్టికి తీసుకెళ్లడంతో సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవాలను ప రిశీలించిన, అనంతరం పాత 35 సర్వే నంబరు పట్టాను రద్దు చేసి, ప్రస్తుతం సా గులో ఉన్న 59 సర్వే నంబరులోని 4 ఎకరాల భూమినే అధికారికంగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అర్ధ శతాబ్ద కాలం నాటి సమస్య పరిష్కారం కావడంతో సదరు రైతు కుటుంబం బుధవారం కలెక్టర్ను తన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సాత్నాల మండల తహసీల్దార్ రామారావు,లబ్ధిదారు కుమారుడు భావనేదత్తు, తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ప్రోత్సహిస్తూ మెరుగైన భవిష్యత్తును అందించాలి








## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 5,( ప్రజా జ్యోతి ) ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల వైద్య సేవలు అందిస్తూ మెరుగైన భవిష్య త్తును అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపు చ్చారు. బుధవారం పట్టణం లోని డబ్ల్యూ కన్వేషన్ హాలులో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాల గల పిల్లల తల్లి దండ్రులకు నిర్వహించిన ఒ కరోజు అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మితో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరైజ్యోతి ప్రజ్వలన వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా బాలకేంద్రం చిన్నారులు చేసిన స్వాగత నృత్య ప్రదర్శన ఆహ్వానితు లను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ, భవిత సెంటర్లలో ఏఐ (కృత్రిమ మేధ) సాంకేతికతతో పాటు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ అందుబాటులోకి తెస్తున్నామని, ఫిజియోథెరపిస్టులు, స్పీచ్ థెరపిస్టులను నియమించి పిల్లలకు తగిన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. భవిత సెంటర్లలో ఇచ్చే చికి త్సలు, శిక్షణలో ఎలాంటి విరామం రాకుండా తల్లిదం డ్రులు ప్రతిరోజూ తమ పిల్లలను సెంటర్లకు పంపించా లని సూచించారు. మధ్యలో గ్యాప్ వస్తే పిల్లలు కోలుకునే ప్రక్రియ మరింత ఆలస్యమ వుతుందన్నారు. గర్భధార ణ సమయంలోనే 'టీఫా' స్కాన్ ద్వారా పిల్లలలో వచ్చే లోపాలను ముందే గుర్తించవచ్చని, జన్మించిన వెంటనే సమస్య ఉన్న పిల్లలను 'రిమ్స్' లోని డిస్ట్రిక్ట్ ఎ ర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కి తీసుకెళ్లి వైద్యం అందిస్తే త్వ రగా సాధారణ స్థితికి వస్తా రని వివరించారు. దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వం రవాణా, రీడింగ్, ఎస్కార్ట్ అలవెన్సులు, స్టైఫండ్ వంటి సదుపాయాలను నేరుగా అందిస్తోందని తెలిపారు. త్వరలోనే అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని, దీనికోసం ప్రతి ఒక్కరూ యూడిఐడి కార్డ్, బెంచ్ మార్క్ డిసేబిలిటీ సర్టిఫికెట్ కలి గి ఉండాలని స్పష్టం చేశా రు. 'దివ్యాంగుల హక్కుల చట్టం 2016' ద్వారా ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెరిగాయని గు ర్తుచేశారు. ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడల్లో ఆదిలాబాద్ జిల్లా మొ దటి స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, పిల్లల్లోని ప్రతిభను ప్రోత్సహిం చాలని తల్లిదండ్రులను కోరారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల భవిష్యత్తుకు భరోసానిస్తూ, వారిని సమా జంలో ఉన్నత స్థాయికి తీసుకురావడం మనందరి సామాజిక బాధ్యతని పిలుపునిచ్చారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలలో అపార మైన ప్రతిభ ఉంటుందని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని అన్నారు. తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు ఎంతో ఓపికతో, ప్రేమతో ఈ పిల్లలను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ ద్వారా అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఉన్నత విద్యా అవకాశాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. పిల్లలను ఇళ్లకే పరిమితం చేయకుండా, సమాజంలో ముందుకు నడిపించేందుకు అవగాహన పెంచాలని సూచించారు. సమాజంలో ఇబ్బందులు పడుతున్న ఇతర కుటుంబాలకు సైతం ధైర్యాన్ని నింపి, ప్రోత్సహించాల్సి న బాధ్యత మనందరిపై ఉం దన్నారు. అనంతరం పలు వురు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను కలెక్టర్, కార్యదర్శి సన్మానించారు. ఈ అవగాహన సద స్సులో చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు గంగారాం, జిల్లా విద్యాశాఖ అధికారి మాధ వి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సాధన, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ జగ దీశ్వర్, జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి పునాదిరాళ్లు





: ఆదే గజేందర్

## మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ప్రారంభం

**నేరడిగొండ ఆగస్ట్ 05 (ప్రజాజ్యోతి )** :ఏఐసీసీ అలాగే టిపిసిసి ఆదేశాల మేరకు పార్టీ చేపట్టిన సంఘటన్ శ్రీజన్ అభియన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు ముందుగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపూరావు,బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆదే గజేందర్, మాజీ డిసిసి సాజిద్ ఖాన్, అదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, అదిలాబాద్ పిఎసి మెంబర్ ఏలేటి అశ్విన్ రెడ్డి, మండల అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి లతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు, అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ నూతన మండల కమిటీల నియామకంలో ఎలాంటి వర్గ విభేదాలకు తావు లేకుండా అందరిని కలుపుకొని పోవాలని సామాజిక న్యాయం పాటిస్తూ పారదర్శకంగా కమిటీలను సిద్ధం చేయాలని ప్రతి మండల కమిటీలో మండల అధ్యక్షునితో కలిపి మొత్తం 21 మంది సభ్యులు ఉండాలని ఇందులో ఇద్దరు ఉపాధ్యక్షులు నలుగురు ప్రధాన కార్యదర్శి లు అలాగే పార్టీ కమిటీలలో మహిళ నాయకులకు కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని పార్టీ అభివృద్ధికి ప్రజల సమస్యలపై అంకిత భావంతో పనిచేసే ప్రతి నాయకుడిని కార్యకర్తను పార్టీ ఆదిస్థానం కచ్చితంగా గుర్తించి తగిన గౌరవం అందిస్తుందని హామీ ఇచ్చారు,

**అనంతరం బోత్ నియోజకవర్గ ఇన్చార్జి ఆదే గజేందర్ మాట్లాడుతూ**

కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యమని సామాజిక న్యాయంతో మండల కమిటీల ఏర్పాటు చేయడం జరుగుతుందని ఇలాంటి వర్గ విభేదాలకు తావు లేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని సామాజిక న్యాయస్ఫూర్తిని పాటిస్తూ పారదర్శకంగా కమిటీలను రూపొందించి తగిన గౌరవం కల్పిస్తుందని ఆదే గజేందర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆదే గజేందర్,బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్య నారాయణ, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, కుమారి పాక్స్ చైర్మన్ మందుల రమేష్, నారాయణ సింగ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి,సద్దాం, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్ లు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సదర్ మాట్ నీరు విడుదల చేయాలి మస్కాపూర్ రైతుల డిటి మంజులకు వినతి



**ఖానాపూర్ ఆగస్టు 5( ప్రజా జ్యోతి )**ఖానాపూర్ రైతాంగానికి సదరు మాట్ నిరు విడుదల చేయాలంటూ డిప్యూటీ తహసీల్దార్ మంజులకు మాస్కాపూర్ రైతులు బుధవారం వినతిపత్రం సమర్పించారు సాధార్మాట్ కెనాల్ నీటి విడుదల చేయకుంటే ఆందోళన చేస్తామని సందర్భంగా అన్నారు ఈ కార్యక్రమంలో గజేందర్ రాజారెడ్డి తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు

## అభివృద్ధి బాటలో జిల్లా గ్రంథాలయాలు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**





**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 5, (ప్రజా జ్యోతి )** జిల్లా వ్యాప్తంగా నూతన గ్రం థాలయాల ఏర్పాటుతో పా టు పాత భవనాలకు అవస రమైన మరమ్మతులు త్వరి తగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి గ్రంథాలయాల అభివృద్ధి, ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాల పై ఆయన ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా సమీక్షని ర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠకులకు, ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నిరంతరం ఉపయోగపడేలా గ్రంథాల యాల్లో ఆధునిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. నూతన లైబ్రరీల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వేగ వంతం చేయాలని, మరమ్మతులు అవసరమైన పాతభవ నాల పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలని అధికారులను సూచిం చారు. గ్రంథాలయాల బలోపేతానికి సంబంధిత శాఖల అధికారు లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా స మావేశంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.సురేష్ బాబు, జిల్లా సంక్షేమాధి కారి మిల్కా, జిల్లా పంచాయితీ అధికారి, రమేష్, ఇతర అ ధికారులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో జిల్లా ముందంజ





**జిల్లాకలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 5, (ప్రజా జ్యోతి )** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు ప్రక్రియ జిల్లాలో అత్యంత విజయ వంతంగా సాగుతోందని, తెలంగాణ రాష్ట్రంలోనే మన జిల్లా ఐదో స్థానంలో నిలవడం ఎంతో సంతోషకరమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు చేసుకున్న సభ్యులకు ఆయన గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సభ్యత్వ నమోదు పెంచడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా అధికా రులు, పట్టణ ప్రముఖులు మరియు పౌరులు భాగస్వా ములై ఇప్పటివరకు సుమా రు 2,500కి పైగా ఇండియ న్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్య త్వాలను తీసుకున్నారని కలెక్టర్ వెల్లడించారు. హిందూ సనాతన సమితి బృందం, రిమ్స్ వైద్య కళాశాల టీహబ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, ప్రింట్, ఎల క్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి సభ్యత్వం పొందడం అభినందనీయమన్నారు. సభ్యత్వం పొందిన వారం దరికీ రెడ్ క్రాస్ గుర్తింపు కా ర్డులను అందజేశామని పే ర్కొన్నారు. రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ నిర్ణయం మేరకు త్వ రలోనే జిల్లా నూతన పాల కవర్గ ఎన్నికలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఎన్నిక అనంతరం ఏర్పడే నూత న కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రెడ్ క్రాస్ సేవా కా ర్యక్రమాలను మరింత పక డ్బందీగా, విస్తృతంగా నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్, మీడియా ప్రతిని ధులు అస్మత్, వెంకటేష్, రిమ్స్ వైద్య కళాశాల టీ హబ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియ న్లు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలు గాలికి వదిలేసిన ఎంపీ, ఎమ్మెల్యే

**బారి వర్షాలకు పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలి**

**మాజీ మంత్రి జోగులాంబ రామన్న**

**జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం**





**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 5, (ప్రజా జ్యోతి )** బారి వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ స్థానిక ఎంపీ, ఎమ్మె ల్యే, రాష్ట్ర ఇన్‌చార్జ్ మంత్రిలు రైతుల సమస్యలను పక్కనపెట్టి వారి స్వంత కార్యక్రమాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి జోగు రామన్న విమ ర్శించారు.పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బారి వర్షాలతో పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్ట పోయారని, ఇప్పటికే జొన్న రైతులు కూడా అనేక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని వివరించారు.అనంతరం జోగు రామన్న మాట్లాడు తూ ప్రజాప్రతినిధులు పార్టీ కార్యక్రమాలను పక్కనపెట్టి రైతుల ఆవేదనను గుర్తించి వెంటనే స్పందించాలని కో రారు. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు పూర్తిగా దెబ్బ తినడంతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోయా రని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే క్షేత్ర స్థాయిలో సమగ్ర సర్వే నిర్వ హించి పంట నష్టాన్ని అంచ నా వేసి రైతులకు తక్షణమే ఎకరానికి 25వేలు నష్టపరి హారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాలపై ఒ త్తిడి తీసుకురావాలని సూచించారు. లేకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేప డతామని హెచ్చరించారు.గతంలో జొన్న రైతుల సమ స్యలపై జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయగా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి రూ.40 కోట్లను మంజూరు చేసిందని, మరో రూ.100 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉందని కలెక్టర్ తెలిపినట్లు జోగు రామన్న పేర్కొన్నారు. ఆరూ.100 కోట్లను కూడా తక్ష ణమే రైతుల ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చే శారు. రైతులకు బీ ఆర్ ఎ స్ పార్టీ ఎల్లప్పుడూ అండ గా ఉంటుందని, అవసరమై తే రైతుల తరఫున ఉద్య మాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, యూనిస్ అక్బాని, గంద్రత్ రమేష్, చందాల రాజ న్న, కుమ్రా రాజు, బట్టు సతీ ష్, కనక రమణ, ఉమాకాం త్ రెడ్డి, మహేందర్ తదిత రులు పాల్గొన్నారు.

## ముర్రుపాలె బిడ్డకు శ్రీరామరక్ష

**అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న**



**లక్ష్మణ చాంద, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)** ముర్రుపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న, అన్నారు. బుధవారం రోజున అంగన్వాడి సెంటర్లో తల్లిపాల వారోత్సవాల ను నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ ప్రసన్న మాట్లాడు తూ తల్లిపాలు వెలకట్టలేని వని బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని తల్లి తొలిసారి ఇచ్చే ముర్రు పాలలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, వీటిలో విటమిన్లు ప్రోటీన్లు లభిస్తాయని, జీర్ణ వ్యవస్థ బాగా పనిచేసి పొట్ట సమస్యలు రాకుండా చేస్తాయని అన్నారు. గర్భవతులకు నార్మల్ డెలివరీకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓస కవిత రాజు, హెల్త్ సూపర్వైజర్ సత్యమ్మ, వరల్డ్ కోఆర్డినేటర్ బ్రహ్మన్న, హెల్త్ అసిస్టెంట్ భాగ్య రేఖ, అంగన్వాడీలు పద్మ, ప్రేమ లత, వరలక్ష్మి, ప్రేమల, రాజమణి, ఆశ కార్యకర్తలు శారద, లక్ష్మి, తల్లులు, గర్భిణీలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## రిమ్స్ లో వైద్యుల భర్తీ తో మెరుగైన సేవలు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**రిమ్స్ వైద్యుల ఖాళీల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు**





**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 5, (ప్రజా జ్యోతి)** వైద్యుల నియామ కంతో రిమ్స్‌లో వైద్యసేవలు మరింత మెరుగు పడనున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో నీ డైరెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో ని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి కాంట్రాక్టు ప్రాతిపది కన ఆయన వాక్-ఇన్ ఇంట ర్వ్యూలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రిమ్స్ ఆసుపత్రిలో వైద్యుల నియామ కంతో వైద్యసేవలు మరింత మెరుగు పడనున్నాయ న్నారు. ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పూర్తి పారదర్శకంగా నియామక ప్రక్రియ కొనసాగిందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సివిల్ అసి స్టెంట్ సర్జన్లు, సీఎంవో, ఆర్ ఎంవో పోస్టుల కోసం అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువప త్రాలతో హాజరయ్యారనీ, కాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పో స్టులకు 21 మంది, సివిల్ అసిస్టెంట్ సర్జన్ సహా ఇతర పోస్టులకు 27 మంది మొత్తం 52 మంది వైద్య అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరైనట్లు తెలిపారు.ఈ ప్రక్రియలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, వైద్యులు, ఇతర అధికారులు, వైద్య శా ఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ముని పెల్లిలో తల్లిపాల వారోత్సవాలు



**లక్ష్మణ చాంద, ఆగస్టు 5 (ప్రజా జ్యోతి)** ముర్రుపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని అంగన్వాడీలు సుజాత, ఇందిర అన్నారు. బుధవారం రోజున అంగన్వాడీ సెంటర్లో తల్లిపాల వారోత్సవాల ను నిర్వహించారు. వారు మాట్లాడుతూ తల్లిపాలు వెలకట్టలేని వని బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని తల్లి తొలిసారి ఇచ్చే ముర్రు పాలలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, వీటిలో విటమిన్లు ప్రోటీన్లు లభిస్తాయని, జీర్ణ వ్యవస్థ బాగా పనిచేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడిపల్లి సునీత గంగాధర్, ఉప సర్పంచ్ రంజిత్ రెడ్డి, ఆశ కార్యకర్తలు తల్లులు, గర్భిణీలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రభుత్వ అధికారుల కు 'ఆవిష్కరణల'పై శిక్షణ



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 5,( ప్రజా జ్యోతి )** గ్రామీణ ప్రాంతాల్లోని కొత్త ఆలోచనలను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిం చడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందుకు సాగు తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలి పారు. జిల్లా యంత్రాంగం, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టిజిఐసి) సంయుక్త ఆధ్వ ర్యంలో నేడు (ఆగస్టు 6న) ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక సామర్థ్య పెంపు వర్క్‌షాప్ ను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వ హించనున్నారని తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో జిల్లా మండల స్థాయికి చెందిన సుమారు 150 నుంచి 200 మంది ప్రభుత్వ అధికారులు పాల్గొన నున్నారని పేర్కొన్నారు. స్థానిక స్థాయిలో ఉత్ప త్తుల రూపకల్పన, మార్కెటింగ్, నిధుల సమీకరణ, మెంటార్‌షిప్, ఇంక్యుబేషన్ వం టి అంశాల్లో గ్రామీణ ఆవిష్కర్తలకు సరైన దిశానిర్దేశం చేసేందుకు అధికారుల ను సిద్ధం చేయడమే ఈ స దస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇన్నోవేషన్ పంచాయతీల ద్వారా అందిన వినతులను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని రూప కల్పన చేయడం జరిగిందని, స్టార్టప్‌లు, మహిళా వ్య వస్థాపకత, ఎంఎస్ఎంఈ ప్రోత్సాహం, మేధో సంపత్తి హక్కులు బ్రాండింగ్, విక్రయాల మెళ కువలపై రంగానికి చెందిన నిపుణులు అధికా రులకు అవగాహన కల్పించనున్నారని వివరించారు. జిల్లా స్థాయిలో సృజనాత్మక ఆలోచనలకు ఊతమిస్తూ, ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచేలా ఈ వ్యవస్థను తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రాంతాలలో ఆదివాసి గిరిజ నులకు పోలీసు ఉద్యోగాలను 70 శాతం ఆదివాసి గిరిజన యువతకు కేటాయించాలి

## జిల్లా ఎస్పీ కలెక్టర్ కు వినతి పత్రాలు సమర్పించిన తుడుందెబ్బ నాయకులు

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 5, (ప్రజా జ్యోతి )** ఆదివాసి నిరుద్యోగ యువ తకోసం డా.అరుణ్ కుమర్ తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు పిలుపు మేరకు కానిస్టేబుల్ ఉద్యోగాలలో ఆదివాసీలకు జరిగే అన్యా యం 75% వాట పై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్ పి లకి కలిసి తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్పుర్కు బాపూరావు, పెందోర్ దాదిరావు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు జిల్లా కమిటీలు వినతిపత్రం సమర్పించారు. బుదవారం ఆదిలాబాద్ జిల్లా ఎస్ పి కి పోలీసు రిక్రూట్మెంట్ లో 75% షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై వినతి పత్రం అంద చేసి స్పష్టంగా వివరించారు. తెలంగాణ స్టేట్ పోలిష్ డిపార్ట్ మెంట్ సర్వీస్ రూల్స్ గెజిట్ నోటిఫికేషన్ తేదీ: 10/05/2018 లో పేజీ నెం బర్ 3, 2 క్లాసులో స్ప ష్టంగా షెడ్యూల్ ఏరియాకి 75% స్పష్టంగా పేర్కొన్నారు.జిఓ : ఎంఎస్ నం 30 ట్రైబల్ వెల్ఫర్ తేదీ 11/ 07/2019 ప్రకారం నం 5 సీరియల్ నెంబర్ 9లో స్పష్టంగా పేర్కొన బడి ఉందని పేర్కొన్నారు. జిఓనం 109 తేదీ 17/06/1988 ప్రకారం 75% షెడ్యూల్ ఏరియా అభ్యర్థు లకు కేటాయించాల్సి ఉంది. వీటి ప్రకారం గతంలో జారీ చేసిన




నోటిఫి కేషన్లు, 2015/2018, 2022లో కూడ ఈ నిబంధనల ప్రకారం ఇచ్చారని, తమకు న్యాయం జరిగిందని కానీ పోలీస్ శాఖ జెనరల్ జీవోల ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వటం వలన 5వ షెడ్యూల్ ప్రాంత ఏజెన్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరు గుతుందని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంకి ఈ ప్రాంత జీవోలు, చట్టాలను వివరంగా రాసిపంపాలని, న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మెస్రం దుర్గురాయి సెంటర్ జిల్లా గౌరవ అధ్యక్షులు, తొడసాం అమృత్ రావు జిల్లాసార్ మేడి, మంగం విషంరావ్ రాజగోండ్ సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,టెకం వశాంత్ రావు కొలంసంఘం ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు, మెస్రం మోతిరం, సలాం శ్యాంరావ్, ఆత్రం ప్రమేష్ వర్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్ లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్య క్రమం

తనిఖీలలో 220 ద్విచక్ర వాహనాలు, 29 ఆటోలు, ఒక కారు, స్వాధీనం
46 మద్యం క్వార్టర్ బాటిల్స్, 28 స్మాల్ బాటిల్స్ లభ్యం, ముగ్గురిపై కేసు నమోదు
ముగ్గురు మట్కా ఆడుతు న్న వారిపై కేసులు, నమోదు మొబైల్ ఫోన్స్ సీజ్
150 మంది పోలీసు సిబ్బందితో తెల్లవారుజామున విస్తృత తనిఖీలు
6 నంబర్ ప్లేట్ లేని, ఫేక్ నంబర్ ప్లేట్ వాహనాలు స్వాధీనం
గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, మట్కా లాంటి చట్టవ్యతిరేక కార్యక లాపాలపై హెచ్చరిక
ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి, హెల్మెట్ ధరించాలి
సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 5,( ప్రజా జ్యోతి )** జిల్లాలో శాంతిభద్ర తల పరిరక్షణ, ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడం, నేరా ల నియంత్రణ, ప్రజలతో పోలీసుల అనుసంధానాన్ని మరింత బలోపే తం చేయడం లక్ష్యంగా బుధవారం స్థానిక ఆదిలాబాద్ పట్టణం లోని అంబేద్కర్ నగర్ కాలనీ ప్రాంతంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని తెల్ల వారుజామున నిర్వహించి నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచే సుమారు 150 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 220 ద్విచక్ర వాహనాలు, 29 ఆటోలు, ఒక కారు, స్వా ధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తు న్న 6 వాహనా లను స్వా ధీనం చేసుకొని, (బిఎన్ఎ స్) సెక్షన్ 318(4) ప్రకారం చీటింగ్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మా ట్లాడుతూ, ప్రజలు మతసా మరస్యాన్ని కాపాడా లని, విద్వేషాలకు దారితీసేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవ ద్దని సూచించారు. జిల్లాలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరి స్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రా యితీ (పిడిఎస్) బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం లేదా అక్రమంగా తరలించ డం నేరమని, అలాంటి వా రిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. అలాగే జిల్లాలో రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకొని చట్టాన్ని గౌరవిం చేలా జీవించాలని, లేకపోతే చట్టపర మైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసులు ప్రత్యేక ప్రాధాన్య త ఇస్తు న్నారని, గంజాయి సేవించ డం, నిల్వ ఉంచడం, రవా ణా చేయడం, సరఫరా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్య లు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. సీసీటీవీ కెమెరాల ప్రాధాన్య త తెలియజేస్తూ కాలనీ మొత్తం కలిసికట్టుగా సి సి టీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించా రు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు నిందితుల వద్ద 46 క్వార్టర్ బాటిల్స్ 28 చిన్న మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ముగ్గురు మట్కా ప్లేయర్లు షేక్ ఖలీల్, రంజిత్, దినేష్ లు మట్కా ఆడుతున్నట్లు నిర్ధారించి వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని తెలిపారు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పీడి యాక్ట్ నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తెలిపారు. డీజే లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. డీజే నిర్వాహకులపై, ఓనర్లపై బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, సిఐలు రహీం పాషా, కే నాగరాజు, సైలు, చంద్రశేఖర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు టి. మురళి, ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు నాగనాథ్, వి. విష్ణువర్ధన్, అశోక్, పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ నుంచి బీఆర్ఎస్ లో కి కొనసాగుతున్న చేరికలు

## మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న




**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 5, (ప్రజా జ్యోతి )** జిల్లాలో బీజేపీ నుంచి బీ ఆర్ ఎస్ పార్టీలోకి నిరంతరం వలసలు పెరుగుతా యని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి జోగు రామన్న వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా చేరిన నాయకులకు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడు తూ, ఎన్నికలకు ముందు ఒకలా మాట్లాడి, గెలిచిన తర్వాత పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే తీరును ప్రజలు గమ నిస్తున్నారని అన్నారు. దీపాయిగూడ గ్రామంలో బీజే పీ తరపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆశారెడ్డితో పాటు బీజేపీ సీనియర్ నాయకులు సత్యకర్ జనార్ధన్, సీడం కిషన్, ఆత్రం తులసి రామ్, దాసరి వంశీ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చే రడం శుభపరిణామమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మె ల్యే పాయల్ శంకర్ మోసపూరిత హామీలు, ప్రజావ్య తిరేక వైఖరిని గుర్తించిన కారణంగానే బీజేపీ నాయకు లు బీఆర్ఎస్లో చేరుతు న్నారని అన్నారు.బీజేపీ పా ర్టీలోఎమ్మెల్యే కుటుంబానికే అధిక ప్రాధాన్యత ఇస్తూ, సా ధారణ పార్టీ కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్న రైతుల సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి సారించ కుండా, స్వలాభాలకే ప్రాధాన్య త ఇస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో గట్టి గుణపాఠం ఎదుర్కొంటారన్నారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ నితిన్ రెడ్డి, బొల్లి గంగన్న, బండి స్వామి, బద్దం పోతారెడ్డి, అల్లకొండ అశోక్, గండ్రత్ అశోక్, దేవర్తి గణే ష్, సామ రాకేష్ రెడ్డి, కోర్డెడ్డి ప్రవీణ్ రెడ్డి తదితరులు పా ల్గొన్నారు.

# మందమర్రిలో బోనాల జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు.



**మందమర్రి, ఆగస్టు 05 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని రాజనాలవాడ, మేకల మార్కెట్లో నిర్వహించిన ఆషాఢమాసం బోనాల జాతరలో మాజీ ప్రభుత్వ విప్, మాజీ చెన్నూరు ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నల్లాల ఓదెలు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక ప్రజలను కలిసి వారి సమస్య లు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.